ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో

మీకు నిజం రాసే ధైర్యం ఉందా?

అందుకు

వార్త సంధ్య మీ వేదిక!

రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి



RNI TGTEL/25/A5065

vaartha sandhya

# వార్త సంధ్య

తెలుగు దిన పత్రిక

నిజం నిర్భయంగా మీ ముందుకు






Published From : Rangareddy, Hyderabad e - paper.vaarthasandhya.in సంపుటి : 01 సంచిక : 62 శుక్రవారం 13 - 02 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-

Published From : Rangareddy, Hyderabad e - paper.vaarthasandhya.in VOLUME : 01 Issue : 62 Friday 13 - 02 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-


## ఢిల్లీలో రేవంత్ రెడ్డి బిజీబిజీ..

- మామునూరు విమానాశ్రయం పనులు ప్రారంభించడని రామ్మోహన్ నాయుడుకి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి
- వివిధ విమానాశ్రయాల అభివృద్ధి పనులకు సంబంధించి చర్చ
- ఆదిలాబాద్ విమానాశ్రయానికి అదనంగా 249.82 ఎకరాలు కేంద్రంకి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు
- ఢిల్లీలో రాజ్‌నాథ్ సింగ్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ
- గాంధీ సరోవర్ ప్రాజెక్టు శంకుస్థాపనకు హాజరు కావాలని వినతి
- అనంతరం రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం
- మామునూరు విమానాశ్రయానికి భూసేకరణ ప్రక్రియ పూర్తయినట్లు వెల్లడి



**వార్త సంధ్య, హైదరాబాద్, ఫిబ్రవరి 12 :** ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ఇవాళ రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి చివరి వారంలో నిర్వహించే గాంధీ సరోవర్ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమానికి హాజరు కావాలని కేంద్రమంత్రిని విన్నవించారు. ఈసా, మూసీ నదుల సంగమ స్థలంలో కార్యక్రమం చేపడుతున్నట్లు రక్షణ మంత్రికి వివరించారు. 1948 ఫిబ్రవరిలో మహాత్ముని చితాభస్మాన్ని ఈసా, మూసీ సంగమంలో నిమజ్జనం చేశారని కేంద్ర మంత్రికి తెలియజేశారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో భాగంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టు చేపడుతున్నట్లు, బాపూఘాట్‌ను ప్రపంచ స్థాయి విద్యా, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, పర్యావరణ చిహ్నంగా నిలపనున్నట్లు కేంద్రమంత్రికి తెలియజేశారు. రాజ్‌నాథ్‌సింగ్‌తో భేటీ గురించి ముఖ్యమంత్రి ఎక్స్ వేదికగా పంచుకున్నారు.'ఫిబ్రవరి చివరి వారంలో ఈసా, మూసీ నదుల సంగమ ప్రాంతంలో తలపెట్టిన గాంధీ సరోవర్ ప్రాజెక్టు' శంకుస్థాపన కార్యక్రమానికి వారిని ఆహ్వానించాను. అలాగే ఆ ప్రాంతానికి ఉన్న చారిత్రక - మిగతా 2 లో



2 లో

## తెలంగాణ పంచాయతీలకు శుభవార్త

- కేంద్రం నుంచి రూ.387 కోట్లు విడుదల
- వారం క్రితం తొలి విడతలో రూ.259.63 కోట్లు విడుదల
- రెండు విడతల్లో కలిపి రూ.646.46 కోట్ల నిధులు విడుదల
- పెండింగ్‌లో ఉన్న మరో రూ.2,400 కోట్ల నిధులు

### బీఆర్ఎస్‌కు అధికారం ఇచ్చినా

## చేదు జ్ఞాపకాలే మిగిలాయి



- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- తెలంగాణ వచ్చినా ఉద్యమకారుల కుటుంబాలకు అన్యాయం జరిగిందన్న కవిత
- బడ్జెట్ లో ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్
- త్వరలోనే కొత్త రాజకీయా పార్టీ పెడతామని వెల్లడి

**వార్త సంధ్య, హైదరాబాద్, ఫిబ్రవరి 12 :** కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ ఉద్యమం సాగినప్పుడు ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు న్యాయం జరుగుతుందని భావించామని... కానీ రాష్ట్రం వచ్చాక తీరని అన్యాయం జరిగిందని - మిగతా 2 లో

## 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు రక్షణ శాఖ పచ్చజెండా

- కొత్తగా 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు పచ్చజెండా ఊపిన రక్షణ శాఖ
- ఫ్రాన్స్‌తో ఒప్పందం కుదిరితే భారత వైమానిక దళంలో రఫేల్ యుద్ధ విమానాల సంఖ్య 150కు చేరుకుంటుంది
- కాంబాట్ క్షిపణుల కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్
- త్రివిధ దళాల సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణ శాఖ మరో కీలక నిర్ణయం
- 3.60 లక్షల కోట్ల రూపాయల విలువైన ఆయుధాలు, సైనిక పరికరాల కొనుగోలుకు కేంద్రం పచ్చజెండా
- కాంబాట్ క్షిపణులు, ఎయిర్‌షిప్ ఆధారిత హై ఆల్టిట్యూడ్ సూడో శాటిలైట్ల కొనుగోలుకు అనుమతి
- 'ఆత్మనిర్భర్ భారత్'కు ఇది మరింత ఊతమిస్తుందని రక్షణశాఖ తెలిపింది



**వార్త సంధ్య, ఢిల్లీ, ఫిబ్రవరి 12 :** త్రివిధ దళాల సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణ శాఖ మరో కీలక నిర్ణయం తీసుకుంది. 3.60 లక్షల కోట్ల రూపాయల విలువైన ఆయుధాలు, సైనిక పరికరాల కొనుగోలుకు కేంద్రం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు రక్షణశాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ నేతృత్వంలో సమావేశమైన డిఫెన్స్ అక్వైజిషన్ కౌన్సిల్ సంబంధిత ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. డీఏసీ ఆమోదించిన ప్రతిపాదనల్లో 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్ లభించింది. అదే విధంగా కాంబాట్ క్షిపణులు, ఎయిర్‌షిప్ ఆధారిత హై ఆల్టిట్యూడ్ సూడో శాటిలైట్ల కొనుగోలుకు అనుమతి లభించింది. వైభవ్ యాంటీ ట్యాంక్ మైన్స్, పీ-8ఐ విమానాల వంటి కీలక ఆయుధాలకు కూడా డీఏసీ ఆమోదం తెలిపింది. 'ఆత్మనిర్భర్ భారత్'కు ఇది మరింత ఊతమిస్తుందని రక్షణశాఖ తెలిపింది.ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు వణుకు పుట్టించిన రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. మరికొన్ని రోజుల్లో - మిగతా 2 లో

## పదేళ్లలో చంద్రుడిపై నగరం

- స్పేస్‌ఎక్స్ సీఈవో ఎలాన్ మస్క్ సంచలన ప్రకటన
- పదేళ్లలోపు చంద్రుడిపై నగరం నిర్మిస్తామన్న ఎలాన్ మస్క్
- అంగారకుడి కంటే చంద్రుడిపై నగర నిర్మాణానికే తొలి ప్రాధాన్యం
- ప్రతి 10 రోజులకు చంద్రుడిపైకి ప్రయోగం సాధ్యమేనని వెల్లడి
- 5 నుంచి 7 ఏళ్లలో అంగారకుడిపై పనులు మొదలుపెడతామని స్పష్టం



2 లో

## ఎర్రకోట వద్ద పేలుడు ఘటనలో జైషే హస్తం

- ఐక్యరాజ్య సమితి కీలక నివేదిక
- జైషే వంటి ఉగ్రముఠాలు దక్షిణాసియాలో కార్యకలాపాలు సాగిస్తున్నాయని ఆందోళన
- 2025 నవంబర్ 10న జరిగిన దాడిలో జైషే హస్తం ఉందని సభ్య దేశం ఆరోపించిందని వెల్లడి
- జైషే మహిళా విభాగాన్ని కూడా ఏర్పాటు చేసుకోవడంపై ఐరాస ఆందోళన



2 లో



2 లో

### సంక్రాంతి లక్కీ డ్రా కేసులో

## అంబటికి రిమాండ్

- సంక్రాంతి లక్కీ డ్రా కేసులో అంబటికి 14 రోజుల రిమాండ్
- గుంటూరు కోర్టు ఆదేశాలతో రాజమండ్రి జైలుకు తరలింపు
- పింఛనుదారుల నుంచి డబ్బులు వసూలు చేశారని ఆరోపణలు
- ఇతర కేసుల్లో బెయిల్ వచ్చినా తాజా రిమాండ్ తో మళ్లీ జైలుకే

## ఏ చర్చకైనా సిద్ధం

- మండలిలో నారా లోకేశ్
- పరిశ్రమలకు భూ కేటాయింపులపై శాసనమండలిలో వాడీవేడి చర్చ
- విశ్వసనీయత ఉన్న 5 కంపెనీలకే 99 పైసలకు భూములిచ్చామన్న లోకేశ్
- ఆరోపణలు చేసి పారిపోవడం సరికాదని వైసీపీకి హితవు
- పారిశ్రామికవేత్తల నుంచి కప్ టీ, కేక్ తప్ప ఏమీ తీసుకోలేదని వెల్లడి



**వార్త సంధ్య,అమరావతి, ఫిబ్రవరి 12 :** "నాపై విమర్శలు చేయాలనుకుంటే ఒక్క విషయంలో చేయవచ్చు. టాటా సన్స్ ఛైర్మన్‌ను కలిసినప్పుడు ఆయన బాంబే హౌస్‌లో ఒక కప్పు టీ ఇచ్చారు. దావోస్‌లో నా పుట్టినరోజున కాగ్నిజెంట్ వారు ఒక కేక్ ఇచ్చారు. అంతకుమించి మేం లాలూచీ పడాల్సిన అవసరం లేదు. ఒక కప్పు టీ కంటే నేను వారి వద్ద ఎక్కువ తీసుకున్నట్లు నిరూపిస్తే ఏ చర్చకైనా సిద్ధం" అని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వైసీపీకి - మిగతా 2 లో

### సవాళ్లు-ప్రతిసవాళ్లతో

## దద్దరిల్లిన మండలి

- గవర్నర్ ప్రసంగంపై వాడీవేడి చర్చ
- గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శాసనమండలిలో వాడీ వేడీ చర్చ
- తీర్మానాన్ని బలపరుస్తూ మాట్లాడిన టీడీపీ ఎమ్మెల్సీలు
- గవర్నర్‌పై దాడి చేయాలని ప్రయత్నించడం క్షమించరాని చర్య అని వెల్లడి
- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పాలన చేస్తోందని గవర్నర్ ప్రసంగంలోనూ ఇది ప్రస్ఫుటమైందని ప్రభుత్వ చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ తెలిపారు
- గవర్నర్‌పై దాడి చేయాలని ప్రయత్నించడం క్షమించరాని చర్య అని టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ఆగ్రహం



**వార్త సంధ్య, అమరావతి, ఫిబ్రవరి 12 :** గవర్నర్ ప్రసంగంపై ధన్యాదాలు తెలిపే తీర్మానంపై శాసన మండలిలో అధికార, విపక్షాల మధ్య వాడీ వేడీ చర్చ జరిగింది. పరస్పరం సవాళ్లు ప్రతిసవాళ్లతో సభ దద్దరిల్లింది. గవర్నర్ ప్రసంగంలోని అంశాలపై వైఎస్సార్సీపీ సభ్యులు విమర్శలు చేయగా ఆరోపణలను అధికారపార్టీ సభ్యులు దీటుగా తిప్పి కొట్టారు. ఆరోపణలు నిరూపించేందుకు తాము సిద్ధమని వైఎస్సార్సీపీ సభ్యులు సవాల్ విసరగా, దమ్ముంటే నిరూపించాలని దీనికి తాముసైతం సిద్ధమని అధికారపార్టీ నేతలు ప్రతిసవాల్ విసిరారు.ప్రశ్నోత్తరాల అనంతరం శాసన మండలిలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మండలి ఛైర్మన్ కొయ్యె మోషేను రాజు చర్చ చేపట్టారు. తొలుత ప్రసంగించిన - మిగతా 2 లో

# సంపాదకీయం

## సభాపతి సమరం

లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాను పదవినుంచి దించేయాలన్న తమ కోరిక నెరవేరదని విపక్షాలకు తెలుసు. ఎన్డీయే సంఖ్యాబలం రీత్యా అది జరిగేపనికాదని అధికారపక్షానికీ, స్పీకర్‌కూ కూడా తెలుసు. అయినా, ఓ సందేశాత్మక పోరాటం సాగుతోంది. 120మంది విపక్ష ఎంపీలు సంతకాలు చేసిన నోటీసును లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు కాంగ్రెస్‌పార్టీ అందించగానే, స్పీకర్ ఓంబిర్లా ఎంతో ఉదాత్తంగా అదేదో త్వరగా ముందుకు కదిలేట్టు చూడండని ఆదేశించారట. ఈ ఘట్టం ముగిసేవరకూ సభకు దూరంగా ఉండాలని కూడా ఆయన నిర్ణయించుకున్నారు. తృణమూల్ వినా పలు విపక్షపార్టీలు ఇచ్చిన ఈ నోటీసులో స్పీకర్‌మీద చాలా ఆరోపణలు, పలు ఆక్షేపణలు ఉన్నాయి. ప్రతిపక్ష ఎంపీలు పలు ప్రజాప్రయోజన అంశాలను లేవనెత్తకుండా స్పీకర్ అడ్డుకున్నారని, మాట్లాడనివ్వకుండా వారి ప్రాథమిక హక్కును కాలరాశారని, ఎనిమిదిమందిని ఏకపక్షంగా సస్పెండ్ చేశారని చాలా అంశాలు ఏకరువు పెట్టారు అందులో. నిజానికి ఇందులో చెప్పనివి కూడా అనేకం వారి మనసులో ఉండివుంటాయి. నాలుగుదశాబ్దాల తరువాత జరుగుతున్న ఇటువంటి ప్రయత్నం అధికారపక్షానికి పరోక్షంగా ప్రయోజనం చేకూరుస్తుందో, విపక్షానికి రాజకీయంగా నష్టం చేస్తుందో తెలియదు కానీ, చట్టసభల గౌరవాన్ని మరింత దిగజార్చుతుంది.స్పీకర్ వ్యవస్థను కించపరిచేలా విపక్షం వ్యవహరిస్తోందని అధికారపక్షం ఆరోపిస్తోంది. సభలో ప్రధాని భద్రతమీద స్పీకర్ ఆందోళన చెందడానికి తగిన కారణాలు ఉన్నాయని, వ్యవస్థ పవిత్రతను కాపాడేందుకే ఆయన పలు నిర్ణయాలు తీసుకున్నారని లోక్‌సభ సచివాలయం ఓ ప్రకటన చేసింది. ప్రజాస్వామ్యం అన్నాక అధికార, విపక్షాల మధ్య పోరు సహజం. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతిపక్షాలకు కనీస గౌరవంలేకుండాపోవడం, వాటిని అవమానించడం పెరిగినందున అవి కూడా అతిగా వ్యవహరిస్తున్నమాట నిజం. ఎన్నికల్లో ఎదురుదెబ్బలు తింటున్నకొద్దీ ఇతరత్రా విధానాల్లో తమ ఉనికిని కాపాడుకొనే ప్రయత్నాలు కూడా ఎక్కువవుతాయి. సభ వెలుపల సంగతి అటుంచితే, లోపల ఇరుపక్షాలను సమంగా చూడటం, వాటితో సమానంగా వ్యవహరించడం, సమన్యాయం చేయడం సభాపతి బాధ్యత. కనీసం అటువంటి ప్రయత్నాలు చేస్తున్నట్టు కనిపించినా, ప్రజలకు అలా అనిపించినా బాగుండేది. కానీ, స్వయంగా స్పీకరే తన వ్యాఖ్యలతో, చర్యలూ చేష్టలతో పరిస్థితులు ఉద్రిక్తం చేయడం సరికాదు. స్పీకర్ ఎంతో జాగ్రత్తగా అని వుండవచ్చును కానీ, ప్రధానిమీద సభలో భౌతిక దాడి చేయడానికి కొందరు కాంగ్రెస్ ఎంపీలు కుట్రచేస్తున్నారన్నది ఆ వ్యాఖ్యల సారాంశం. ఆయనను తానే సభకు రావద్దని చెప్పానని సభాముఖంగా ప్రకటించి, విపక్షాలను స్వయంగా అవమానించారు. దేశ ప్రజల దృష్టిలో విపక్ష సభ్యులను విలన్లుగా చిత్రీకరించారు. అంతర్జాతీయంగానూ అప్రదిష్టపాల్జేశారు. మీ వద్ద తగిన ఆధారాలు వుంటే దాడికి కుట్రపన్నుతున్నవారిమీద ఎఫ్ఐఆర్ దాఖలు చేయండని రాహూల్ గాంధీ బహిరంగం సవాలు చేసింది అందుకే.సభలో ఇంతకుమించిన వేడినీ, రచ్చనూ దేశం అనేకసార్లు చూసింది. అనేక వివాదాస్పదమైన అంశాల్లో ఉభయపక్షాలూ ఘర్షణపడ్డాయి. కానీ, ప్రధానమంత్రిని సభకు రావద్దని స్పీకర్ స్వయంగా చెప్పడం చరిత్రలో ఎన్నడూ లేదు. ఒకవేళ ఆయన ఊహించినట్టుగానే సభ్యులు ఎవరైనా అతిగా ప్రవర్తించి వుంటే దేశప్రజలు విపక్షాలను ఎన్నటికీ క్షమించేవి కాదు. కానీ, ప్రధాని సభకు రాకపోవడంతో ఆయన భయపడి పారిపోయారని అప్రదిష్ట వచ్చింది. ప్రధాని ప్రసంగం లేకుండానే రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం ఆమోదం పొందిన ఘట్టం కూడా చరిత్రలో నిలిచిపోతుంది. విపక్షనాయకుడిని మాట్లాడనీయకపోవడం, ప్రధానిని సభకు రావద్దని చెప్పడం రెండూ పార్లమెంటరీ విలువల ఉల్లంఘనే. నరవణే పుస్తకంలో ఏదో ఉన్నదనీ, దానిని రాహుల్ సభలో విప్పుతారన్న భయంతోనే అధికారపక్షం ఇన్ని ఎత్తుగడలు వేసిందన్న అనుమానం అనవసరంగా ప్రజలకు కలిగింది. స్పీకర్ అంటే ఎంతో గౌరవమని అంటూనే అధికార విపక్షాలు ఆడుతున్న రాజకీయ నాటకంలో ఆ పదవీ మర్యాదలకు భంగం వాటిల్లుతున్నది. లోక్‌సభస్పీకర్‌ను తొలగించే ప్రయత్నాలేవీ భారత పార్లమెంటరీ చరిత్రలో విజయవంతం కాలేదని తెలిసినా ఈ నాటకం సాగుతూనే ఉంది.

## సవాళ్లు-ప్రతిసవాళ్లతో దద్దరిల్లిన మండలి

**మొదటిపేజీ తరువాయి** - ప్రభుత్వ చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ తీర్మానాన్ని బలపరుస్తూ ప్రసంగించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పాలన చేస్తోందని గవర్నర్ ప్రసంగంలోనూ ఇది ప్రస్ఫుటమైందని తెలిపారు. 20 లక్షల ఉద్యోగాల సాధన, పెట్టుబడుల సాధన లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వైఎస్సార్సీపీ హయాంలో రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించి దాడులు నిత్యకృత్యంగా చేశారని.వైఎస్సార్సీపీ ప్రజాప్రతి నిధులు వేధింపులకు పాల్పడేవారని ఇంకా దళితులను చంపి డోర్ డెలివరీ చేసే వారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వంలో ల్యాండ్, శాండ్, మైనింగ్ మాఫియాలు విచ్చలవిడిగా చెలరేగాయని అన్నారు. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక శాంతి భద్రతలను పటిష్టంగా అమలు చేస్తున్నామన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేసి అన్ని వర్గాల ప్రజలకు ఆర్థిక సాయం చేస్తున్నామని, అమరావతిని గత ప్రభుత్వం నిర్వీర్యం చేయగా కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అభివృద్ధి చేస్తోందన్నారు.

**కనీసం లాయర్‌నూ నియమించలేదు:** కూటమి ప్రభుత్వం చేస్తోన్న అభివృద్ధి సంక్షేమాన్ని గవర్నర్ ప్రసంగంలో స్పష్టంగా తెలియజేశారని, గవర్నర్‌పై దాడి చేయాలని వైఎస్సార్సీపీ సభ్యులు ప్రయత్నించడం క్షమించరాని చర్య అని టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గవర్నర్ ప్రసంగాన్ని వినలేని వారు వారానికోసారి ఆయన వద్దకు ఎందుకు వెళ్తున్నారో వైఎస్సార్సీపీ నేతలు చెప్పాలని నిలదీశారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని హంద్రీనీవా కాలువ వెడల్పు చేసి కుప్పం నియోజకవర్గానికి నీరిచ్చి చిరకాల వాంఛ నెరవేర్చిందన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌పై వైఎస్సార్సీపీ ప్రభుత్వంలోనే ఎన్జీటీ స్టే ఇచ్చిందని, ప్రాజెక్టు స్టే ఎత్తేందుకు కనీసం మంచి లాయర్‌ను కూడా వైఎస్సార్సీపీ ప్రభుత్వం నియమించ లేదని ఆగ్రహం వ్యక్తం



చేశారు.అనంతరం వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ పర్వతనేని చంద్రశేఖరరెడ్డి పలు ఆరోపణలు, విమర్శలు చేయడంతో శాసన మండలి వేడెక్కింది. అధికార ప్రతిపక్ష సభ్యుల మధ్య పరస్పరం మాటల యుద్ధం, సవాళు ప్రతి సవాళ్లకు దారి తీసింది. తల్లికి వందనం కింద విద్యార్థి తల్లికి ఏటా రూ.15,000 జమ చేస్తామని చెప్పి ఇప్పుడు మోసం చేశారన్న చంద్రశేఖరరెడ్డి ఆరోపణలపై మంత్రి పార్థసారథి తప్పు పట్టారు. గవర్నర్ ప్రసంగంలో అపద్దాలు చెప్పించారని, రైతులకు ఎవ్వరికీ రూ.20,000 పూర్తి మొత్తం చెల్లించలేదని ఒక్క ఏడాదైనా రూ.20,000 ఇచ్చినట్లు రుజువు చేస్తే తాము క్షమాపణలు చెబుతామని మంత్రి పార్థసారథి అన్నారు.అన్ని అబద్దాలు చెబుతూ సభను, ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారని మంత్రి పార్థసారథి అన్నారు. మాట తప్పం మడమ తిప్పమన్న గత ప్రభుత్వం ఇద్దరికి ఇస్తామని ఒక్కరికే అమ్మఒడి ఇచ్చిన సంగతి గుర్తు చేసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం ఇస్తున్నట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏటా రూ.20,000 ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. గత ప్రభుత్వం రైతులకు రూ.7,000 మాత్రమే ఇచ్చిందన్న మంత్రి, రైతులకు ధాన్యం డబ్బులు ఎగ్గొట్టినందుకు వైఎస్సార్సీపీ నేతలు సిగ్గుపడాలని వ్యాఖ్యానించారు.

**ఏ శిక్షకైనా సిద్ధం:** చర్చ సందర్భంగా విపక్ష నేత బొత్స జోక్యం చేసుకోవడంతో మంత్రి పార్థసారథి దీటుగా జవాబిచ్చారు. బొత్స, మంత్రి పార్థసారథి మధ్య మాటకు మాట దారి తీసింది. పరస్పరం సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకున్నారు. తల్లికి వందనం కింద ప్రభుత్వం ఎవరికీ పూర్తిగా రూ.15,000 ఇవ్వలేదని, 63 లక్షల మందిలో కేవలం 15 శాతం మందికే తల్లికి వందనం కింద కేవలం రూ.7 నుంచి 8 వేలు మాత్రమే చెల్లించారని బొత్స ఆరోపించారు. నియోజకవర్గంలోనూ తల్లికి వందనం కింద పూర్తి డబ్బు చెల్లించలేదని సవాల్ చేసిన బొత్స సభను తాను తప్పుదోవ పట్టించినట్లు రుజువు చేస్తే మాటలు విత్ డ్రా చేసుకుని క్షమాపణ చెబుతానన్నారు. బొత్స ఆరోపణలను దీటుగా తిప్పికొట్టిన మంత్రి పార్థసారథి ఆరోపణలను ఖండించారు. బొత్స చేసిన చేసిన ఛాలెంజ్‌ను స్వీకరించేందుకు మేము సిద్ధమని 15 శాతం మందికే చెల్లించినట్లు తేలిస్తే ఏ శిక్షకైనా సిద్ధమన్నారు. అనంతరం ప్రసంగాన్ని కొనసాగించిన వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరు మార్చారని, రద్దు చేయలేదని అన్నారు. ఈ వ్యాఖ్యలను మంత్రి అనగాని సత్యప్రసాద్ తప్పుపట్టారు. వైఎస్సార్సీపీ సభ్యులు చాలా తేలిగ్గా అబద్దాలు చెబుతున్నారన్న మంత్రి, వైఎస్సార్సీపీ సభ్యులు సభలో అబద్దాలు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ని పూర్తిగా రద్దు చేసిన విషయాన్ని తెలుసుకుని మాట్లాడాలన్నారు. సభ్యుల మధ్య వాద-ప్రతివాదనలు, సవాళ్లు-ప్రతి సవాళ్లు కొనసాగుతుండగానే సభను రేపటికి వాయిదా వేస్తున్నట్లు మండలి ఛైర్మన్ కొయ్యె మోషేను రాజు ప్రకటించారు. రేపు ప్రశ్నోత్తరాల అనంతరం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ కొనసాగనుంది.

## ఏ చర్చకైనా సిద్ధం

**మొదటిపేజీ తరువాయి** - సవాల్ విసిరారు. పరిశ్రమలకు భూముల కేటాయింపుల్లో ఎలాంటి అవినీతికి తావులేదని, తమ ప్రభుత్వ ఏకైక లక్ష్యం యువతకు ఉద్యోగాలు కల్పించడమేనని ఆయన స్పష్టం చేశారు. శాసనమండలిలో వైసీపీ సభ్యుల ఆరోపణలకు ఆయన ఈ విధంగా ధీటుగా బదులిచ్చారు.

**మండలిలో భూ కేటాయింపులపై వాడీవేడి చర్చ**

శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో పరిశ్రమలకు 99 పైసలకే భూముల కేటాయింపు అంశంపై వాడీవేడి చర్చ జరిగింది. గత 20 నెలల్లో ప్రభుత్వం కేటాయించిన భూములు, కుదుర్చుకున్న ఒప్పందాలు (ఎంవోయూలు), వాటి ధరల వివరాలపై వైసీపీ సభ్యులు తూమాటి మాధవరావు, వరుదు కల్యాణి, పండుల రవీంద్రబాబు ప్రశ్నలు లేవనెత్తారు. విశాఖలో కోట్ల రూపాయల విలువైన భూములను ప్రైవేటు సంస్థలకు, రియల్ ఎస్టేట్ కంపెనీలకు 99 పైసలకే ఎలా ఇస్తారని వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. ఈ ఆరోపణలపై మంత్రి లోకేశ్ సమగ్రంగా సమాధానమిచ్చారు.

**విశ్వసనీయత ఉన్న 5 కంపెనీలకే 99 పైసలకు భూమి**

రాష్ట్రంలో కేవలం ఐదు విశ్వసనీయమైన (క్రెడిబులిటీ) కంపెనీలకే 99 పైసలకు భూములు కేటాయించినట్లు మంత్రి లోకేశ్ తెలిపారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్), కాగ్నిజెంట్, ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్, రహేజా, మదర్సన్ ఇంటర్నేషనల్ కంపెనీలకు మాత్రమే ఈ ధరకు భూములు ఇచ్చామన్నారు. ఈ ఐదు కంపెనీల ద్వారా రాష్ట్రంలో సుమారు 65,000 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు రానున్నాయని వివరించారు. ఉదాహరణకు, కాగ్నిజెంట్ మొదట 8,000 ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి, భూమిపూజ సమయంలో ఆ సంఖ్యను 25,000కు పెంచిందని గుర్తుచేశారు.

**ఏపీకి పరిశ్రమలు రాకూడదన్నదే వైసీపీ లక్ష్యం**

వైసీపీ తీరుపై మంత్రి లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఏపీకి పరిశ్రమలు రాకూడదని, పెట్టుబడులను తరిమేయాలనే ఏకైక లక్ష్యంతో వైసీపీ పనిచేస్తోందని ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఆర్థిక ఉగ్రవాదం నడిచిందని, అమర్ రాజా వంటి సంస్థను రాష్ట్రం నుంచి తరిమేశారని విమర్శించారు. తాము 17 నెలల్లోనే ఆర్సెలర్ మిట్టల్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థను రాష్ట్రానికి తీసుకొచ్చామని, దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ఉత్తరాంధ్రలో రాబోతోందని చెప్పారు. వాస్తవాలు తెలుసుకోకుండా వైసీపీ సభ్యులు సభను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు.

**హైదరాబాద్ మోడల్‌ను విశాఖలో పునరావృతం చేస్తాం**

విశాఖలో బలమైన ఐటీ ఎకోసిస్టమ్ లేదని, దాన్ని నిర్మించడానికే ప్రభుత్వం తక్కువ ధరకు భూములు కేటాయిస్తోందని లోకేశ్ వివరించారు. 1994-2004 మధ్య చంద్రబాబు హైదరాబాద్‌లో ఐఎస్‌బీ, మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్ వంటి సంస్థలకు తక్కువ ధరకే భూములు ఇవ్వడం వల్లే నేడు హైదరాబాద్ గ్లోబల్ సిటీగా మారిందన్నారు. గుజరాత్‌లో టాటా నానో ఫ్యాక్టరీకి అప్పటి సీఎం నరేంద్ర మోదీ 99 పైసలకే భూమి ఇచ్చి మొత్తం ఆటోమొబైల్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో విశాఖను ఐటీ, జీసీసీ హబ్‌గా మార్చాలనేది తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు.

**ఆరోపణలు నిరూపించలేక వైసీపీ వాకౌట్**

చర్చ సందర్భంగా, అడ్రస్ లేని ఉర్సా కంపెనీకి ప్రభుత్వం భూములు కట్టబెట్టాలని చూస్తోందని వైసీపీ సభ్యులు ఆరోపించారు. ఈ ఆరోపణను మంత్రి లోకేశ్ తీవ్రంగా ఖండించారు. తాము కేవలం ఐదు కంపెనీలకే 99 పైసలకు భూములు ఇచ్చామని, ఆరో కంపెనీ అయిన ఉర్సాకు భూములు కేటాయించినట్లు ఆధారాలు బయటపెట్టాలని సవాల్ విసిరారు. నిరూపించలేకపోతే క్షమాపణ చెప్పాలని పట్టుబట్టారు. ఈ క్రమంలో వైసీపీ సభ్యులు, బొత్స సత్యనారాయణ నేతృత్వంలో నిరసనగా సభ నుంచి వాకౌట్ చేశారు.

**విశాఖలో 5 లక్షల ఐటీ ఉద్యోగాలే మా లక్ష్యం**

విపక్ష సభ్యులు వాకౌట్ చేసిన అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. తమ ప్రభుత్వ లక్ష్యాన్ని పునరుద్ఘాటించారు. 2029 నాటికి ఒక్క విశాఖలోనే ఐటీ రంగంలో 5 లక్షల ఉద్యోగాలు సృష్టించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ఒక ఐటీ ఉద్యోగం ద్వారా పరోక్షంగా మరో ఐదారుగురికి ఉపాధి లభిస్తుందని, దీనివల్ల విశాఖ ఆర్థిక వ్యవస్థకు ఏటా 10 బిలియన్ డాలర్ల మేర మేలు జరుగుతుందని వివరించారు. ప్రభుత్వానికి రెండు రూపాయల ఆదాయం తగ్గినా పర్వాలేదు కానీ, యువతకు ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాల హామీని నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు.

**ప్రతిపక్ష ఆరోపణలు సత్యదూరం**

వైసీపీ సభ్యులు సత్యదూరమైన మాటలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, ఛాలెంజ్ చేస్తే సమాధానం చెప్పలేక పారిపోవడం వారికి అలవాటేనని లోకేశ్ ఎద్దేవా చేశారు. భూముల కేటాయింపు ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతుందని, అధికారుల కమిటీ, ఎస్ఐపీబీ, కేబినెట్ ఆమోదం తర్వాతే కేటాయింపులు చేస్తున్నామని తెలిపారు. క్లస్టర్ విధానంలో పరిశ్రమలను అభివృద్ధి చేస్తామని, ప్రతి పరిశ్రమ గ్రౌండింగ్ అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు

## సంక్రాంతి లక్కీడ్రా కేసులో అంబటికి రిమాండ్

**మొదటిపేజీ తరువాయి** - మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత అంబటి రాంబాబుకు మరో కేసులో రిమాండ్ పడింది. 2023లో సత్తెనపల్లిలో సంక్రాంతి సంబరాల సందర్భంగా నిర్వహించిన లక్కీ డ్రా కేసులో గుంటూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టు ఆయనకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న సమయంలో, 2023 జనవరిలో అంబటి రాంబాబు సంక్రాంతి సంబరాల పేరుతో లక్కీ డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా వాలంటీర్ల ద్వారా పింఛనుదారుల నుంచి రూ.200 చొప్పున అక్రమంగా వసూలు చేసి, వారికి బలవంతంగా లాటరీ టికెట్లు అంటగట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై జనసేన పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు కోర్టులో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.ప్రస్తుతం మరో కేసులో రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న అంబటిని, పోలీసులు పీటీ వారెంట్‌పై ఇవాళ గుంటూరు కోర్టులో హాజరుపరిచారు. కేసు వివరాలను పరిశీలించిన న్యాయమూర్తి ఎం. కుముదిని, ఆయనకు 14 రోజుల రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో అంబటిని తిరిగి రాజమండ్రి జైలుకు తరలించారు.సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యల కేసులో బెయిల్ లభించగా, గతేడాది మెడికల్ కాలేజీ అంశంపై నిర్వహించిన ఆందోళనల్లో పోలీసులతో దురుసుగా ప్రవర్తించారన్న కేసులోనూ ఆయనకు బెయిల్ లభించింది. ఈ రెండు కేసుల్లో బెయిల్ రావడంతో అంబటి విడుదల కావడం లాంఛనమేనని అందరూ అనుకున్నారు. అయితే, పోలీసులు సంక్రాంతి లక్కీ డ్రా కేసులో పీటీ వారెంట్ పై కోర్టును ఆశ్రయించగా, న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో అంబటికి నిరాశే మిగిలింది. తాజా రిమాండ్‌తో ఆయన విడుదల ఆగిపోయింది.

## 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు రక్షణ శాఖ పచ్చజెండా

**మొదటిపేజీ తరువాయి** - ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ భారత్ పర్యటనకు రానున్న వేళ ఈ డీల్‌కు డీఏసీ అమోదం తెలిపింది. 'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా రఫేల్ విమానాలను భారత్‌లోనే తయారు చేసే విధంగా కేంద్రం ప్రయత్నాలు చేస్తోంది. విమానాల విడిభాగాల తయారీ కోసం రఫేల్ మాతృ సంస్థ డసో ఏవియేషన్‌తో భారత్ చర్చలు జరపనుంది. ఫ్రాన్స్‌తో ఈ ఒప్పందం కుదిరితే భారత వైమానిక దళంలో రఫేల్ యుద్ధ విమానాల సంఖ్య 150కు చేరుకుంటుంది. ప్రస్తుతం భారత వాయుసేన దగ్గర 36 రఫేల్ యుద్ధ విమానాలు ఉన్నాయి.కాంబాట్ క్షిపణుల ద్వారా సుదూర లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదించవచ్చని రక్షణశాఖ తెలిపింది. గగనతలంలో నిరంతరం నిఘా ఉంచేందుకు, ఇంటెలిజెన్స్ సమాచారం సేకరించేందుకు ఎయిర్‌షిప్ ఆధారిత హై ఆల్టిట్యూడ్ సూడో శాటిలైట్లు ఎంతో ఉపయోగపడతాయని వెల్లడించింది. స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన విభవ్ యాంటీ- ట్యాంక్ మైన్లు శత్రువుల యుద్ధ ట్యాంకర్‌లను సులభంగా అడ్డుకుంటాయని పేర్కొంది. ప్రస్తుతం ఉన్న ౦-72 ట్యాంకులు, ఆర్మోర్డ్ రికవరీ వెహికల్స్, ఇన్‌ఫాంట్రీ కాంబాట్ వెహికల్స్‌లను పూర్తిగా మరమ్మతు చేసి, వాటి జీవితకాలాన్ని పెంచుతామని రక్షణశాఖ తెలిపింది.సముద్ర జలాల్లో జలాంతర్గాములను పసిగట్టడంలో పీ-8ఐ యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ యుద్ధవిమానం ప్రపంచంలోనే అత్యుత్తమైనదని రక్షణశాఖ స్పష్టం చేసింది. భారత నావిక దళానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని వివరించింది. నౌకాదళ అవసరాల కోసం 4 మెగావాట్ల సామర్థ్యం గల మెరైన్ గ్యాస్ టర్బైన్ ఆధారిత జనరేటర్లను స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేయనున్నట్లు వెల్లడించింది. సముద్ర నిఘా సామర్థ్యాన్ని పెంచేందుకు డోర్నియర్ విమానాలకు ఎలక్ట్రో-ఆప్టికల్ లేదా ఇన్‌ఫ్రా-రెడ్ సిస్టమ్స్‌ను అమర్చనున్నట్లు రక్షణశాఖ తెలిపింది.రఫేల్ యుద్ధ విమానాల తయారీలో ప్రముఖ సంస్థ అయిన దసో ఏవియేషన్, భారత్‌కు చెందిన టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ మధ్య గతేడాది జూన్‌లో నాలుగు చారిత్రాత్మక ఉత్పత్తి బదిలీ ఒప్పందాలు జరిగాయి. ఈ ఒప్పందం ప్రకారం హైదరాబాద్‌లో ఒక అత్యాధునిక ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతున్నారు. ఈ తయారీ కేంద్రంలో రఫేల్ యుద్ధ విమానానికి సంబంధించిన కీలకమైన నిర్మాణ భాగాలను ఇక్కడే తయారు చేస్తారు. ఇక్కడి నుంచి మొదటి ఫ్యూజ్‌లేజ్ విభాగాలు 2028 నాటికి బయటకు వస్తాయని చెప్పారు

## ఢిల్లీలో రేవంత్ రెడ్డి బిజీబిజీ..

**మొదటిపేజీ తరువాయి** - నేపథ్యాన్ని గౌరవ కేంద్రమంత్రికి వివరించాను. 1948 ఫిబ్రవరిలో మహాత్ముని చితాభస్మాన్ని ఈసీ, మూసీ సంగమ స్థలిలో కలిపిన విషయాన్ని గుర్తు చేశాను. ప్రజా ప్రభుత్వం తలపెట్టిన మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టులో భాగంగా "గాంధీ సరోవర్" ప్రాజెక్టు చేపడుతున్నామని, శంకుస్థాపనకు రావాల్సిందిగా ఆహ్వానించాను.' అని ఎక్స్‌లో రాసుకొచ్చారు. రామ్మోహన్ నాయుడుతో సీఎం భేటీ : దిల్లీ పర్యటనలో భాగంగా మధ్యాహ్నం 12.30 గంటలకు పౌరవిమానయాన మంత్రి





రామ్మోహన్ నాయుడుతో సీఎం భేటీ అయ్యారు. కేంద్ర మంత్రికి రేవంత్ రెడ్డి మామునూరు విమానాశ్రయానికి భూసేకరణ పూర్తయినట్లు తెలిపారు. ఈ మేరకు దానికి సంబంధించి అవసరమైన పనులు చేపట్టాలని సీఎం విన్నవించారు. కొత్తగూడెం ఎయిర్‌పోర్ట్‌కు పాల్వంచలో స్థలం గుర్తించినట్లు పేర్కొన్నారు. రామ్మోహన్ నాయుడుకు ఎయిర్‌పోర్టు స్థలానికి ఓఎల్ఎస్ సర్వే, ఫీజుబిలిటీ స్టడీ నిర్వహించాలని సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా అంతర్గామ్ విమానాశ్ర యానికి అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి అదనంగా 249.82 ఎకరాలు ఇచ్చేందుకు సిద్ధమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. భేటీ ముగిసిన అనంతరం రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సీఎం సమావేశం అయ్యారు. ఖర్గేతో భేటీ : దిల్లీ పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సమావేశం అయ్యారు. అయనతో ఇటీవల జరిగిన దావోస్ పర్యటన, హార్వర్డ్‌లో జరిగిన శిక్షణ, మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన విషయాలను వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇవాళ కొందరు కేంద్రమంత్రులను కలిసి రాష్ట్రానికి సంబంధించిన సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్తారని అధికార వర్గాలు తెలిపాయి. అలాగే పార్లమెంటుకు వెళ్లి ఎంపీలను కలిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించాయి.

## పదేళ్లలో చంద్రుడిపై నగరం

**మొదటిపేజీ తరువాయి** - టెస్లా, స్పేస్‌ఎక్స్ సీఈవో ఎలాన్ మస్క్ మరో సంచలన ప్రకటన చేశారు. అంగారకుడిపై మానవ ఆవాసాల ఏర్పాటును లక్ష్యంగా పెట్టుకున్న ఆయన ఇప్పుడు తన ప్రణాళికల్లో కీలక మార్పు చేసినట్లు తెలిపారు. రాబోయే పదేళ్లలోపే చంద్రుడిపై స్వయం సమృద్ధితో కూడిన నగరాన్ని నిర్మించడంపై స్పేస్‌ఎక్స్ ఇప్పటికే దృష్టి సారించిందని వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ఆయన ఓ పోస్ట్ చేశారు.అంగారకుడితో పోలిస్తే చంద్రుడిపై నగరాన్ని నిర్మించడం చాలా వేగంగా సాధ్యమవుతుందని మస్క్ వివరించారు. మానవ నాగరికత భవిష్యత్తును కాపాడటానికి చంద్రుడిపై స్థావరం ఏర్పాటు చేయడమే వేగవంతమైన, సులువైన మార్గమని ఆయన అభిప్రాయపడ్డారు. దీనికి గల కారణాలను కూడా ఆయన వివరించారు. అంగారకుడికి వెళ్లాలంటే గ్రహాల అనుకూలత కోసం 26 నెలలు ఆగాలని, ప్రయాణానికి ఆరు నెలలు పడుతుందని తెలిపారు. కానీ, చంద్రుడిపైకి మాత్రం ప్రతి 10 రోజులకు ఒకసారి స్పేస్‌క్రాఫ్ట్‌ను పంపవచ్చని, ప్రయాణానికి కేవలం రెండు రోజులే పడుతుందని పేర్కొన్నారు. దీనివల్ల నగర నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయవచ్చని అన్నారు.అయితే, అంగారకుడిపై నగరం నిర్మించే ప్రణాళికను పూర్తిగా విరమించుకోలేదని మస్క్ స్పష్టం చేశారు. "రాబోయే 5 నుంచి 7 ఏళ్లలో మార్స్ నగరంపై కూడా పనులు ప్రారంభిస్తాం. కానీ, ప్రస్తుతానికి మాత్రం నాగరికత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చంద్రుడిపై నగర నిర్మాణానికే తొలి ప్రాధాన్యత ఇస్తున్నాం" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. స్పేస్‌ఎక్స్ లక్ష్యం ఎప్పటికైనా జీవాన్ని, చైతన్యాన్ని నక్షత్రాలకు విస్తరించడమేనని ఆయన పునరుద్ఘాటించారు.

## ఎర్రకోట వద్ద పేలుడు ఘటనలో జైషే హస్తం

**మొదటిపేజీ తరువాయి** - ఢిల్లీలోని చారిత్రాత్మక ఎర్రకోట సమీపంలో గత ఏడాది జరిగిన కారు బాంబు పేలుడు ఘటనలో పాకిస్థాన్ కేంద్రంగా పని చేస్తోన్న ఉగ్రవాద సంస్థ జైషే మొహమ్మద్ హస్తం ఉందని ఐక్యరాజ్యసమితి ఉగ్రవాద నిరోధక పర్యవేక్షణ బృందం నివేదిక పేర్కొంది. ఉగ్రవాద కార్యకలాపాల కోసం మహిళా విభాగాన్ని కూడా ఏర్పాటు చేసిందని ఆందోళన వ్యక్తం చేసింది.ఆర్థిక ఆంక్షలు, అంతర్జాతీయ ఒత్తిడులు ఉన్నప్పటికీ జైషే సహా పలు ఉగ్ర మూకలు దక్షిణాసియాలో క్రియాశీలకంగా తమ నేర కార్యకలాపాలను సాగిస్తున్నాయని వెల్లడించింది. ఐరాస భద్రతా మండలికి సమర్పించిన నివేదికలో ఉగ్రవాద నిరోధక పర్యవేక్షణ బృందం ఈ విషయాలను ప్రస్తావించింది.జైషే మూకలు పలు ఉగ్రవాద దాడులకు పాల్పడినట్లు తెలుస్తోందని, అందులో ఒకటి 2025 నవంబర్ 10న ఎర్రకోట సమీపంలో జరిగిన దాడి అని ఐరాస సభ్య దేశం ఒకటి ఆరోపించిందని పేర్కొంది. ఈ దాడిలో 15 మంది మరణించినట్లు తెలిపింది.అలాగే ఉగ్రవాద కార్యకలాపాల విస్తరణ కోసం గత ఏడాది జమాత్ ఉల్ ముమినత్ పేరుతో మహిళా విభాగాన్ని ఏర్పాటు చేసిందని పేర్కొంది. పహల్గామ్ దాడి ఘటనను కూడా ఐరాస తన నివేదికలో ప్రస్తావించింది. జైషే వంటి ఉగ్రవాద సంస్థలు తమ దేశంలో లేవని పాకిస్థాన్ కొంతకాలంగా వాదిస్తోంది. ఈ తరుణంలో ఐరాస నివేదిక ప్రాధాన్యం సంతరించుకుంది.

## బీఆర్ఎస్‌కు అధికారం ఇచ్చినా చేదు జ్ఞాపకాలే మిగిలాయి

**మొదటిపేజీ తరువాయి** - కేసీఆర్ కుమార్తె, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు.బాగ్ లింగంపల్లిలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమకారుల ఆత్మగౌరవ సభలో కవిత మాట్లాడుతూ... ఉద్యమ సోయి లేని రేవంత్ రెడ్డి సీఎం కావడం తెలంగాణ చేసుకున్న దౌర్భాగ్యమని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను రాబోయే బడ్జెట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం తప్పక నెరవేర్చాలని డిమాండ్ చేశారు. హామీలు నెరవేర్చకపోతే ఊరుకోబోమని హెచ్చరించారు. బీఆర్ఎస్‌కు అధికారం ఇచ్చినా చేదు జ్ఞాపకాలే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రొఫెసర్ కోదండరామ్, ఆకునూరి మురళి వంటివారు రేవంత్‌తో కలవడంతోనే తాము కాంగ్రెస్‌ను నమ్మామని... కానీ రెండున్నరేళ్లుగా ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడటం లేదని కవిత విమర్శించారు. బడ్జెట్ లో హామీలకు సంబంధించిన నిర్ణయాలు లేకపోతే కోదండరామ్ ను ప్రశ్నిస్తామని హెచ్చరించారు.త్వరలోనే కొత్త రాజకీయ పార్టీ పెడతామని కవిత ప్రకటించారు. అది పక్కా రాజకీయ పార్టీ కాదని, తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడే పార్టీ అని స్పష్టం చేశారు. సహనశీలత లేకపోవడం, అహంకారం కారణంగానే బీఆర్ఎస్ అధికారం కోల్పోయిందని, మంచితనం, భోళాతనం తెలంగాణ తత్వమని చెప్పారు. అవి కోల్పోతే మనల్ని మనం కోల్పోయినట్టేనని అన్నారు. ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాల వైపే ధర్మం ఉందని, వారి కోసం పోరాటం చేస్తామని కవిత ప్రకటించారు. ప్రైవేట్ ఉద్యోగాల్లో తెలంగాణ బిడ్డలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. జయశంకర్ సార్ విగ్రహం కేబీఆర్ పార్క్‌లో లేదా ట్యాంక్ బండ్‌పై పెట్టాలని అప్పట్లో మున్సిపల్ శాఖ మంత్రిని ఎన్నోసార్లు అభ్యర్థించినా సాధ్యం కాలేదని అన్నారు.

## తెలంగాణ పంచాయతీలకు శుభవార్త

**మొదటిపేజీ తరువాయి** - తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు ఆర్థిక సంఘం రూ.387 కోట్ల నిధులు విడుదల చేసింది. వారం రోజుల క్రితం తొలి విడతగా రూ.259.36 కోట్లు విడుదల చేసింది. తాజాగా మరోసారి విడుదల చేయడంతో రెండు విడతల్లో కలిపి రూ.646.46 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసినట్టయింది.ఈ నిధులతో, గ్రామపంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న పనులకు, మౌలిక సదుపాయాల కల్పనకు ఊతం లభించనుంది. కేంద్రం నుంచి గ్రామ పంచాయతీలకు మరో రూ.2,400 కోట్ల నిధులు రావాల్సి ఉంది. గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడకుండా ఉండటానికి పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ మంత్రి సీతక్క కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో కేంద్రం నుంచి విడతలుగా నిధులు వస్తున్నాయి.

# నూతన జాతీయ విద్యా విధానం2020,

## వికాసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ బిల్లు2025 రద్దు చేయాలి

## ఏఐఎస్ఎఫ్ నాయకుల డిమాండ్



**కొత్తగూడెం, ఫిబ్రవరి 12 (వార్త సంధ్య) :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యా విధానం2020తో పాటు వికాసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ బిల్లు2025ను తక్షణమే రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు చేపట్టిన సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నూతన జాతీయ విద్యా విధానం2020 ద్వారా పేద, మధ్యతరగతి విద్యార్థులను విద్యకు దూరం చేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నూతన జాతీయ విద్యా విధానం2020ను రద్దు చేసి, కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 15 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్స్‌ను కూడా వెంటనే రద్దు చేయాలని కోరారు. లేబర్ కోడ్స్ అమలుతో కార్మికులపై పని భారం పెరిగి, కనీస హక్కులు కూడా కోల్పోయే ప్రమాదం ఉందని, కార్పొరేట్ సంస్థలు కార్మికుల శ్రమను దోపిడీ చేసే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన విమర్శించారు. ఇవాళ్టి విద్యార్థులే రేపటి ఉద్యోగస్తులని, కాబట్టి ఈ విధానాలు భవిష్యత్ తరాలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సంజయ్, 4 ఇంక్లైన్ శాఖ కార్యవర్గ సభ్యుడు మైల రాజేశ్వరరావు, జిల్లా సమితి సభ్యులు భాను, సాయి, స్నేహిత్ తదితరులు పాల్గొన్నారు.

# కార్పోరేషన్ ఓటర్లు మన పక్షానే నిలిచారు

## ఓట్ల లెక్కింపు సమయంలో అప్రమత్తంగా ఉండాలి

## కార్పోరేషన్ అభ్యర్థులు, ఏజెంట్లకు దిశా నిర్దేసం చేసిన ఎమ్మెల్యే కూనంనేని

**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 12( వార్త సంధ్య) :** కార్పోరేషన్ ఎన్నికల్లో ఓటర్లు మన పక్షానే నిలిచారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం స్థానిక శేషగిరి భవన్ సిపిఐ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కార్పోరేషన్ ఎన్నికల లెక్కింపు ప్రక్రియ సందర్భంగా పోటీచేసిన అభ్యర్థులతో పాటు కౌటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కౌటింగ్లో పూర్తి స్థాయి ఫలితాలు వెలువడేంత వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. డిక్లరేషన్ ఫాములు అందుకున్న తర్వాతే కౌంటంగ్ కేంద్రం నుండి బయటకు రావాలని, ఎటువంటి అనుమానాలు ఉన్నా వెంటనే రీకౌటంగ్ కోరాలని సూచించారు. కార్పోరేషన్ వ్యాప్తంగా సిపిఐ అభ్యర్థులే గెలవబోతున్నారని అన్నారు. కౌటింగ్ కు సంబంధించి అనుబోస్ కాలేజీలో అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారని, కౌటింగ్ విషయం లో అనుసరించాల్సిన



విధి విధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూనంనేని వివరించారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా మాట్లాడుతూ అభ్యర్థితో పాటు ఏజెంట్సమయానికి కౌటింగ్ కేంద్రానికి చేరుకోవాలని, బ్యాలెంట్ బాక్సుల ప్రధాన సీల్ సరిగా ఉందా లేదా అనే విషయాన్ని సరిచూసుకోవాలని చెప్పారు. అభ్యర్థితో పాటు కౌటింగ్ ఏజెంట్లు చాలా అప్రమత్తంగా ఉండాల్సిన సమయం ఇదే



అని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, ఫయూమ్ దాదా, ధస్రు, విశంశెట్టి పూర్ణచంద్రరావు, జిల్లా సమితి సభ్యులు కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, నాగుల్మీరా, కేశవులు, మనిగడప వెంకటేశ్వర్లు, పద్మ, పద్మజ, భూక్యా శ్రీను, అన్నారపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# తిరువూరు అభివృద్ధికి సీఎం గ్రీన్ సిగ్నల్

## ఎమ్మెల్యే కొలికపూడి కృషికి చంద్రబాబు ప్రశంసలు



**తిరువూరు ఫిబ్రవరి 12 (వార్త సంధ్య) :** అసెంబ్లీ సమావేశం అనంతరం తిరువూరు నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక సమస్యలను గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి దృష్టికి తీసుకువెళ్లారు శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు గారు. గంపలగూడెం మండలం వినగడప కట్టలేరు వంతెన నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరు అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. అదేవిధంగా, నియోజకవర్గంలోని గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో రోడ్ల దుస్థితి గురించి కూడా ఎమ్మెల్యే గారు వివరంగా తెలియజేశారు. పలు గ్రామాల్లో రహదారులు అధ్వాన్న స్థితిలో ఉండటం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సీఎం దృష్టికి తీసుకువెళ్లి, తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు గారు చూపుతున్న పట్టుదల, బాధ్యతాయుత వైఖరిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు అభినందించారు. "ప్రజల సమస్యలపై మీరు చూపుతున్న శ్రద్ధ అభినందనీయం. అభివృద్ధి కార్యక్రమాల్లో మీకు పూర్తి సహకారం ఉంటుంది" అని ప్రోత్సాహకరంగా పేర్కొన్నారు.వినగడప కట్టలేరు వంతెన నిర్మాణానికి అవసరమైన నిధులు త్వరలోనే మంజూరు చేస్తామని, అలాగే రోడ్ల సమస్యల పరిష్కారానికి కూడా దశలవారీగా చర్యలు చేపడతామని సీఎం హామీ ఇచ్చారు. ఈ హామీలతో తిరువూరు నియోజకవర్గ ప్రజల్లో ఆశలు మరింత బలపడగా, ఎమ్మెల్యే గారి కృషి పట్ల అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

# భక్తి శ్రద్ధలతో చక్ర తీర్థ మరియు పుష్పయాగము తో ముగిసిన తంగడపల్లి శ్రీవారి 50వ వార్షిక బ్రహ్మోత్సవములు

## సప్తావర్ణాల సేవ పుష్పయాగం లో పాల్గొని తరించిన సుధీర్ రెడ్డి

**చేవెళ్ల,ఫిబ్రవరి 12 (వార్త సంధ్య):** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం తంగడపల్లి గ్రామంలోని శ్రీ దశావతార సహిత శ్రీ లక్ష్మి అలమేలుమంగ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు భక్తి శ్రద్ధలతో, అత్యంత వైభవంగా ముగిసాయి. స్వస్తి శ్రీ విశ్వావసు నామ సంవత్సర మాఘ బ: పంచమి అనగా తేదీ 6-2-2026 నుండి తేదీ 11-2-2026 వరకు ఆలయ ప్రాంగణము మరియు గ్రామం ఆధ్యాత్మిక చైతన్యంతో శ్రీ పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారంగా 50వ బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. రాత్రి ధ్వజ అవరోహణం మరియు పుష్పయాగం సందర్భంగా గ్రామ ప్రజలు వివిధ రకాల పుష్పాలతో శ్రీ వారికి పుష్ప వర్షం కురుపించి, సప్తావర్ణముతో సేవ నిర్వహించి బ్రహ్మోత్సవాలు ముగించారు. భక్తులు ఆనందభాష్పాలు రాల్చారు. "జై శ్రీమన్నారాయణ", "శ్రీనివాస పరబ్రహ్మణే నమః" అనే నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. గత రెండు దశాబ్దాలుగా ఈ మహోత్సవానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.





స్వామిసేవను జీవన సాధనగా భావిస్తూ నిస్వార్థ భక్తితో సేవలందిస్తున్న, స్వామివారి కృపాకటాక్షాలతో సుధీర్ రెడ్డి కుటుంబం ఆయురారోగ్య ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని భక్తులు ఆకాంక్షించారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు శ్రీమాన్ నడాదూర్ వెంకటనాథాచార్యులు, శ్రీమాన్ నడాదూర్ శేషాద్రి చార్యులు, శ్రీమాన్ నడాదూర్ వేణుగోపాలచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదమంత్రాల ఘోషల మధ్య సాగిన ఈ మహోత్సవం తంగడపల్లి గ్రామాన్ని ఆధ్యాత్మిక క్షేత్రంగా మార్చింది. గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, చిన్నారులు సహా భక్తజనం పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపాశీర్వాదాలను పొందారు. భక్తి, సంప్రదాయం, సేవా తత్వాలకు నిలువెత్తు ప్రతిరూపంగా నిలిచిన ఈ శ్రవణోత్సవ మహోత్సవం తంగడపల్లి గ్రామ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతుందని భక్తులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో గొల్లగూడెం బాగిరెడ్డి సుధీర్ రెడ్డి స్వాతిక విహన్య రెడ్డి , విహాన్షిక రెడ్డి పాల్గొన్నారు

# గ్రామీణ మహిళలకు ఆర్థిక స్వావలంబన దిశగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ

## ఎన్.ఐ.ఆర్.డి లో హ్యాండ్ మేడ్ పేపర్ ప్రాడక్ట్స్ పై శిక్షణ

## పత్రిక ప్రకటన విడుదల చేసిన ఎంపీ కేశినేని శివనాథ్, కేశినేని ఫౌండేషన్ కార్యాలయం



**కృష్ణాజిల్లా బ్యూరో ఫిబ్రవరి 12 వార్త సంధ్య :** జిల్లా పరిధిలోని,విజయవాడ, గ్రామీణ మహిళలు తమ జీవనోపాధి అవకాశాలను విస్తరించుకుని ఆర్థికంగా స్వాలంబన సాధించే దిశగా నడిపించేందుకు ఎంపీ కేశినేని శివనాథ్ సారధ్యంలో కేశినేని ఫౌండేషన్, ఎన్.ఐ.ఆర్.డి సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డి ప్రధాన కార్యాలయంలో హ్యాండ్ మేడ్ పేపర్ ప్రొడక్ట్స్ తయారీపై అందిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణను ఎన్టీఆర్ జిల్లా కు చెందిన ఎస్.హెచ్.జి మహిళలు అందిపుచ్చుకుంటున్నారు. ఫిబ్రవరి 9 వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు ఐదు రోజుల పాటు జరిగే ఈ శిక్షణా కార్యక్రమంలో నాలవ రోజు గురువారం ఎన్.ఐ.ఆర్.డిలో ఎస్.హెచ్.జి మహిళలు పొందిన శిక్షణ వివరాలను తెలియజేస్తూ ఎంపీ కేశినేని శివనాథ్, కేశినేని ఫౌండేషన్ కార్యాలయం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది.ఎన్.ఐ.ఆర్.డి లో హ్యాండ్ మేడ్ పేపర్ ఉత్పత్తుల తయారీకి సంబంధించి గాంధీ హ్యాండ్ మేడ్ పేపర్ యూనిట్ అధికారి జె.రవీంద్రరావు నేతృత్వంలో పల్ప్ తయారీ, షీట్ నిర్మాణం, స్క్రీన్ ప్రింటింగ్, ఎన్వలప్ కవర్స్, పెన్స్ స్టాండ్ తయారీ పై,అవగాహన శిక్షణ తరగతులు నిర్వహించారు. అనంతరం వీటిని ఎలా తయారు చేయాలో శిక్షణ ఇచ్చారు.. అలాగే స్క్రీన్ ప్రింటింగ్ యూనిట్ ను సందర్శించారు.

# శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున దేవస్థానం జాతర మహోత్సవానికి ఎస్పీకి ఆహ్వానం



**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 12(వార్త సంధ్య) :** అన్నపురెడ్డిపల్లి శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 14 నుండి 16 వరకు నిర్వహించనున్న జాతర మహోత్సవానికి సంబంధించి ఆహ్వాన పత్రికను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ శ్రీ రోహిత్ రాజు ను ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అందజేశారు. ఆలయ చైర్మన్ మల్లెల నరసింహారావు, పాలకమండలి సభ్యులు మరియు ఆలయ కార్యనిర్వాహక అధికారి రమణ గారు కలిసి ఎస్పీని ఆహ్వానించారు. జాతర మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ సహకారం కోరారు. ఈ కార్యక్రమంలో గుజ్జ పూర్ణచంద్రరావు, బోయినపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఐఏఎస్ విద్యార్థులకు ప్రత్యేక క్లాస్ తీసుకున్న తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు



**తిరువూరు ఫిబ్రవరి 12 (వార్తసంధ్య) :** యన్ టీ ఆర్ జిల్లా తిరువూరు విజయవాడలో ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐఏఎస్ శిక్షణా కేంద్రంలో గౌరవ శాసనసభ్యులు కొలిక పూడి శ్రీనివాసరావు గారు విద్యార్థులకు ప్రత్యేక క్లాస్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సివిల్ సర్వీ సెస్ పరీక్షల ప్రాముఖ్యత, సిద్ధత విధానం, సమయ నిర్వహణ, మరియు లక్ష్య సాధనలో క్రమశిక్షణ యొక్క అవ సరంపై వివరణాత్మకంగా బోధించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులు కూడా పట్టుద లతో ముందుకు సాగితే ఉన్నత స్థాయిలను చేరుకోవచ్చని ప్రోత్సహించారు. విద్యార్థులు ఎమ్మెల్యే గారి ప్రసం గాన్ని ఆసక్తిగా విన్నారు. శిక్షణా కేంద్రం అధికారులు మరియు అభ్యర్థులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

# బయోచార్ తయారీ విధానంపై జిల్లా కలెక్టర్ అవగాహన.



**టేకులపల్లి, ప్రతినిధి ఫిబ్రవరి 12:( వార్త సంధ్య):** బేతంపూడి గ్రామపంచాయతీలో బయోచార్ (పత్తి కట్టేనుండి బొగ్గు తయారీ) తయారీ విధానం మరియు పంట పొలాలకు బయోచార్ ఉపయోగం గురించి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. రైతులు తెలివిగా వ్యవసాయం పద్ధతులు నేర్చుకోవాలని, ప్రతి రైతు కుటుంబానికి 3 నుండి 4 పద్ధతుల ద్వారా నిరంతరం ఆదాయం వచ్చే మార్గాలు ఎంచుకోవాలని కోరారు. కౌజు పిట్టల పెంపకం, మునగ తోట పెంపకం, చేప పిల్లల పెంపకం, పుట్టగొడుగుల పెంపకం, తేనెటీగల పెంపకం, కూరగాయల పెంపకం, మేకల పెంపకం లాంటి వనరుల ద్వారా ఆదాయం పొందే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విద్యా చందన, ఎంపీడీవో కుమారి బైరు మల్లేశ్వరి, మండల తాహసిల్దార్ లంకా వీరభద్రం, సర్పంచ్‌లు ఓకే సునీత, వ్యవసాయ అధికారి అన్నపూర్ణ, డి ఆర్ డి ఏ కన్సల్టెంట్ రాజు, ఇంజనీర్‌లు, అదనపు కార్యక్రమ అధికారి కళింగి శ్రీనివాస్, వ్యవసాయ శాఖ సిబ్బంది, కార్యదర్శులు, ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

# జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ ఆకస్మిక సందర్శన.



టేకులపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 12 (వార్త సంధ్య) : జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరియు టేకులపల్లి ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. రోగులకు అందుతున్న సేవలను పరిశీలించి, సిబ్బంది నిర్లక్ష్యం వహించవద్దని ఆదేశించారు. అనంతరం, టేకులపల్లిలోని కస్తూరాబా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించి, హాస్టల్‌లో పిల్లలకి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. పోషకాహారం, పరిశుభ్రత, రోగ నిరోధక శక్తి గురించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ కందుల దినేష్, డాక్టర్ కంచర్ల వెంకటేష్, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ మోహన్, ఆరోగ్య విస్తరణ అధికారి దేవా , ఉపాధ్యాయ సిబ్బంది, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉండేటి ప్రసాద్ విగ్రహావిష్కరణ: ఎమ్మెల్యే కోరం కనకయ్య.



**టేకులపల్లి, ప్రతినిధి, ఫిబ్రవరి 12 (వార్త సంధ్య) టేకులపల్లి :** సులానగర్ గ్రామపంచాయతీకి చెందిన మాజీ వైస్ ఎంపీపీ స్వర్గీయ ఉండేటి ప్రసాద్, సంవత్సరీకం మరియు విగ్రహా విష్కరణ కార్యక్రమంలో ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం విగ్రహా నికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య, మాట్లాడుతూ.. స్నేహ శీలి, అందరి బంధువుడు టేకులపల్లి మండల వైస్ ఎంపీపీగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేసిన ఉండేటి ప్రసాద్ మన మధ్య లేకపోవడం చాలా బాధాకరమని, ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన లేక పోవడం పార్టీకి ఎంతో లోటని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి కోరం లక్ష్మీ, కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్, కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, బంధువులు గ్రామస్తులు తదితరుల పాల్గొన్నారు.

# మాజీ కార్పొరేటర్ కళ్లెం జీవన్ రెడ్డి ని సన్మానించిన బంజారా కాలనీవాసులు..!



**హయత్‌నగర్ ప్రతినిధి,వార్త సంధ్య, ఫిబ్రవరి 12:** హయత్ నగర్ డివిజన్ పరిధిలోని బంజారా కాలనీవాసులు స్థానిక మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ని ఘనంగా సన్మానించారు. గత ఐదు సంవత్సరాల కాలంలో కాలనీలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల కల్పన, సీసీ రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థ, వీధి దీపాలు వంటి సమస్యలను పరిష్కరించడంలో ఆయన చూపిన చొరవకు కృతజ్ఞతగా ఈ సన్మానం నిర్వహించారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, పార్టీలకు అతీతంగా సేవలందించిన నాయకుడిగా ఆయన నిలిచారని కాలనీవాసులు కొనియాడారు. ఈ సందర్భంగా కాలనీ పెద్దలు, యువత కలిసి శాలువా కప్పి తమ అభిమానాన్ని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల ప్రేమ, ఆదరణే తనకు పెద్ద బలం అని, భవిష్యత్తులో కూడా కాలనీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జంజ్య, బాలు, వి. బాలు, రాఘు, జి. బాలు, బాషా, పంతు, దాసు, ఆనంద్, వెంకటేష్, నాగరాజ్, కిరణ్, శివ, రాజేష్. మరియు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి నిరంతరం కృషి చేసినందుకు బి.యన్.రెడ్డి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి కి కృతజ్ఞతలు - ఎస్ కే డి నగర్ కాలనీ సభ్యులు




**హయత్‌నగర్ ప్రతినిధి,వార్త సంధ్య, ఫిబ్రవరి 12:** బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎస్ కే డి నగర్ కాలనీ సమస్యల పరిష్కారానికి మరియు అభివృద్ధికి బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి సహకరించినందుకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ కార్పొరేటర్ గా 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ మరియు కాలనీలో అభివృద్ధికి నిరంతరం కృషి చేసినందుకు మరియు సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రావు, రఘురాం నేత, ఈర్లపల్లి వెంకటరెడ్డి, శ్రీనివాసరావు, ఎరువ వెంకటరెడ్డి, చక్రధర్ రావు, పి వెంకట్ రెడ్డి, ప్రవీణ్ గౌడ్, మంద ప్రభాకర్, గోపాల్ రావు, రాజగోపాల్ రావు, సుబ్బారావు, కాంతారావు, శంకరన్న, వెంకట హరి, వెంకట్రావు, భరత్లాల్ నాయక్, మరియు ఎస్.కె.డి నగర్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# రాజరాజేశ్వరి ఆలయం వద్ద వీధి దీపాల ప్రారంభం



**దుబ్బాక ప్రతినిధి ఫిబ్రవరి 12(వార్త సంధ్య) :** సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం లో పెద్దచికోడ్ గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయి. గ్రామ సర్పంచ్ కొమిరే నరేష్ , ఉప సర్పంచ్ కొండల్ రెడ్డి మరియు పాలకవర్గం ఆధ్వర్యంలో రాజరాజేశ్వరి ఆలయం పరిసర ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు ఈరోజు వీధి దీపాలను ప్రారంభించారు. ఇటీవల చెరువు కట్ట నుండి ఆలయం వరకు స్తంభాలు ఏర్పాటు చేయగా, ఇప్పుడు వాటికి లైట్లు అమర్చడంతో ఆ ప్రాంతం ప్రకాశ వంతంగా మారింది. దీంతో ఆలయానికి వచ్చే భక్తులకు మరియు గ్రామ ప్రజలకు రాత్రి వేళ ల్లో సౌకర్యం కలిగింది. వార్డు మెంబెర్ కంకణాల రాజు మరియు గ్రామ ప్రజలు మాడ అశోక్, కమ్మరి నర్సింగా రావు, బీమరి రాజు, పసుపునూరి దేవరాజు, పున్న నరేష్, కాసారం కృష్ణ గౌడ్, బండ హనుమంతు పాల్గొ న్నారు గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్న సర్పంచ్ మరియు పాలకవర్గానికి గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు.

# అంగన్వాడీ టీచర్ల డిమాండ్లతో ర్యాలీ, మనోహరం.



**టేకులపల్లి, ప్రతినిధి ఫిబ్రవరి 12: (వార్త సంధ్య) :** టేకులపల్లి మండల కేంద్రంలోని బోడు సెంటర్ నందు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ, ఏఐటీయూసీ మరియు సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను తిప్పి కొట్టాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి బోర్డు సెంటర్ నందు మనోహరం నిర్వహించారు. ఏఐటీయూసీ అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ డిమాండ్ నోటీస్ వినతి పత్రాన్ని టేకులపల్లి మండల తాసిల్దార్ కార్యాలయంలో ఆర్ ఐ 2 సౌజన్య కి అందజేయడం జరిగింది. అంగన్వాడీ టీచర్లను ఆయాలను ప్రభుత్వ టీచర్లుగా గుర్తించాలి, అంగన్వాడీ టీచర్లకు ఆయాలకు కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలి, పదవీ విరమణ పొందిన అంగన్వాడీ టీచర్లకు ఆయాలకు రిటైర్మెంట్ బెనిఫిట్ బకాయిలు ఇవ్వాలి, పెరిగిన ధరలకు అనుగుణంగా ఆరోగ్య లక్ష్మి మేను చార్జీలు పెంచాలి, అర్హులైన అంగన్వాడీ టీచర్లకు సూపర్వైజర్ పదోన్నతి కల్పించాలి, హెల్త్ కార్డులు పిఎఫ్ గ్రావిటీ వర్తింపచేయాలి, సెంటర్ అద్దెలు గ్యాస్ బిల్లులు ఆరోగ్యలక్ష్మి బిల్లులు వేతనాలు ప్రతినెలా చెల్లించాలి, బదిలీలు ప్రమోషన్లు తర్వాతేనే ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయాలి, పోషణ అభియాన్ డబ్బులు రిటైర్మెంట్ అయిన వారికి కూడా ఇవ్వాలి, సుప్రీంకోర్టు గైడ్ లైన్ ప్రకారం అదనపు పనులు రద్దు చేయాలి, 2023 సెప్టెంబర్ 11 నుండి అక్టోబర్ 4 వరకు చేసిన 24 రోజుల సమ్మె కాలం వేతనాలు చెల్లించాలి, అంగన్వాడీ టీచర్లకు ఇచ్చిన విధంగా మట్టి ఖర్చులు ఆయాలకు కూడా 20000 ఇవ్వాలి. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు గుగులోతు రామ్ చందర్, రాయల ఇందిరా, సంధ్యారాణి, సుగుణ, పద్మ, బిచ్చాలి, సిఐటియు జిల్లా నాయకులు ఈసం నరసింహారావు, కే వీరన్న, కే శకుంతల, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో 44వేలకు పైగా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు

**అక్రిడిటేషన్ ప్రక్రియ మరింత పారదర్శకంగా**

**అర్హులందరికీ న్యాయం**

**రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**హైదరాబాద్ , ఫిబ్రవరి 12 ( వార్త సంధ్య ) :** రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకూ అక్రిడిటేషన్ కార్డు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పనిచేస్తోందని పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ విధానం, అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటు తదితర అంశాలపై గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ సిహెచ్. ప్రియాంక, ముఖ్యమంత్రి సిపిఆర్వో జి. మల్సూర్‌లతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. అక్రిడిటేషన్ కార్డుల జారీకి సంబంధించి ప్రభుత్వం ముందుగా జి.ఓ. 252 జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. అనంతరం జర్నలిస్టు సంఘాలతో సమావేశమై వారి సూచనలు, అభిప్రాయాలను సవివరంగా పరిగణనలోకి తీసుకొని అవసరమైన సవరణలు చేసి జి.ఓ. 103ను జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ సవరణల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా మరియు డిజిటల్ మీడియా విభాగాల్లో మొత్తం 44,706 అక్రిడిటేషన్ కార్డులు పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు.గతంలో సుమారు 23 వేల మందికి మాత్రమే అక్రిడిటేషన్ కార్డులు ఉండగా, తాజా నిర్ణయంతో దాదాపు 21 వేలకు పైగా కార్డుల సంఖ్య పెరుగుతుందని మంత్రి వివరించారు.2.50 లక్షల పైగా సర్క్యులేషన్ ఉన్న 8 పత్రికలకు 6,256 కార్డులు, 75 వేల నుండి 2.50 లక్షల వరకు సర్క్యులేషన్ ఉన్న24 పత్రికలకు 17,784 కార్డులు , 25001 నుంచి 75 వేల వరకు సర్క్యులేషన్ ఉన్న 30 పత్రికలకు 3,390, అదేవిధంగా 15001 నుంచి 25000 వరకు సర్క్యులేషన్ ఉన్న 169 చిన్న పత్రికలకు 11,661 , 15వేలలోపు సర్క్యులేషన్ ఉన్న 113 చిన్న పత్రికలకు 226, పీరియాడికల్స్‌కు 624, 20 న్యూస్ ఏజన్సీలకు 68 అక్రిడిటేషన్‌లు పొందుతాయని తెలిపారు.అలాగే 21 శాటిలైట్ ఛానళ్లకు 4,431 కార్డులు, 8 జాతీయ ఛానల్స్‌కు 32, వంద లోకల్ కేబుల్ ఛానళ్లకు 200 ,డిజిటల్ మీడియా విభాగానికి 10 కార్డులు మొత్తంగా 44,706 కార్డులు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర మరియు జిల్లా స్థాయిలో 16,056, నియోజకవర్గ మరియు మండల స్థాయిలో 28,650 మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, అవసరాన్ని బట్టి మరోసారి సమావేశమై తదుపరి చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా ఉన్న మీడియా ప్రతినిధుల గౌరవం, భద్రత, సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

# జనగామ గ్రామానికి గర్వకారణం

**ఉస్మానియా యూనివర్సిటీలో జనగామ శంకర్‌కు డాక్టరేట్**



**రామగుండం, ఫిబ్రవరి 12 ( వార్త సంధ్య ):** రామగుండం మండలం జనగామ గ్రామానికి చెందిన జనగామ శంకర్ సోమవారం ఉస్మానియా యూనివర్సిటీలో డాక్టరేట్ పొందారు."ఆటోమేటిక్ జనరేషన్ కంట్రోల్ సిస్టమ్‌లో లోడ్ ఫ్రీక్వెన్సీ కంట్రోల్‌లో కృత్రిమ మేధస్సు (ఐ×) పాత్ర" అనే అంశంపై పరిశోధనలు పూర్తి చేసినందుకు ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేయబడింది.ఈ సందర్భంగా జనగామ శంకర్ మాట్లాడుతూ, మారుమూల ప్రాంతమైన జనగామ గ్రామం నుంచి తన విద్యా ప్రయాణం ప్రారంభమైందని, ఇది కేవలం విద్యా ప్రయాణం మాత్రమే కాకుండా జీవితంలో ఎదురైన ప్రతి అడ్డంకిని జయించి సాధించిన ఒక పోరాట యాత్ర అని తెలిపారు.ఈ విజయం తన గురువు ప్రొఫెసర్ జి. మల్లేశం సమర్థవంతమైన మార్గదర్శకత్వం వల్లే సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. అలాగే తన కుటుంబం చేసిన అనేక కష్టాలు, త్యాగాలు, ముఖ్యంగా తన తల్లి ఆశీర్వాదం మరియు తన భార్య డాక్టర్ ఏ. శిల్ప అందించిన సహకారం ఈ విజయానికి మూలాధారమని అన్నారు.ఈ డాక్టరేట్ తన వ్యక్తిగత గౌరవం మాత్రమే కాదని, అట్టడుగు వర్గాల నుంచి, శ్రమ జీవుల కుటుంబాల నుంచి వచ్చి విద్య ద్వారా ఎదగాలనే కలతో పోరాడుతున్న ప్రతి విద్యార్థికి అంకితమైన గౌరవమని జనగామ శంకర్ భావోద్వేగంగా తెలిపారు.


# కందుల జాహ్నవి మృతి కేసులో కీలక పరిణామం


**కుటుంబానికి రూ.262 కోట్ల పరిహారం**

**అమెరికాలో పోలీసు అధికారి నిర్లక్ష్యం వల్ల మృతి చెందిన తెలుగు విద్యార్థిని**

**ఆమె కుటుంబానికి పరిహారం చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకున్న సియాటెల్**

**ఈమేరకు సిటీ అటార్నీ ఎరికా ఇవాన్స్ ప్రకటన విడుదల**





అమెరికాలో ఒక పోలీసు అధికారి నిర్లక్ష్యం కారణంగా తెలుగు విద్యార్థిని కందుల జాహ్నవి మరణించింది. తాజాగా ఈ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆమె కుటుంబానికి సుమారు రూ.262 కోట్లు (అమెరికా కరెన్సీలో 29 మిలియన్ డాలర్లు) పరిహారం చెల్లించేందుకు సియాటెల్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు బుధవారం (అమెరికా కాలమానం ప్రకారం) సిటీ అటార్నీ ఎరికా ఇవాన్స్ ప్రకటన విడుదల చేశారు.కందుల జాహ్నవి మృతి చెందడం అత్యంత బాధాకరమని, ఈ సెటిల్మెంట్ ఆమె కుటుంబానికి కాస్త ఉపశమనం కలిగిస్తుందని ఆశిస్తున్నట్లు సియాటెల్ అటార్నీ ప్రకటనలో పేర్కొన్నారు. అయితే దీనిపై జాహ్నవి కుటుంబం తరఫున అటార్నీ నుంచి ఇంత వరకు కూడా ఎటువంటి స్పందన లేదు. ఈ కేసులో పరిహార ఒప్పందం కోసం ఇరుపక్షాలు గత వారం కోర్టులో దరఖాస్తు చేసినట్లు సమాచారం.

**కేసు వివరాలు :** ఏపీలోని కర్నూలు జిల్లాకు చెందిన జాహ్నవి (23) ఉన్నత చదువుల కోసం 2021లో అమెరికాకు వెళ్లింది. ఆమె సౌత్‌లేక్ యూనియన్‌లోని నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీలో చేరింది. 2023 జనవరి 23న రాత్రి, జాహ్నవి రోడ్డు దాటుతుండగా వేగంగా వస్తున్న పోలీసు పెట్రోలింగ్ వాహనం ఆమెను ఢీకొట్టింది.ఈ ఘటనలో జాహ్నవి తీవ్రంగా గాయపడింది. ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఈ ప్రమాదానికి కారణమైన పోలీసు అధికారి కెవిన్ డవే. జాహ్నవి మరణం గురించి జోక్ చేయడం అప్పట్లో తీవ్ర వివాదానికి దారి తీసింది.'ఆమె ఓ సాధారణ వ్యక్తి. ఈ మరణానికి విలువ లేదు' అని పోలీస్ అధికారి అన్న మాటలు ఆయన బాడీ కెమెరాలోనే రికార్డు అయ్యాయి. దీనిపై అప్పట్లో ఇండియా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. కెవిన్ తీరు పై అమెరికాలోనూ విమర్శలు వెల్లువెత్తాయి. ఫలితంగా అతన్ని విధుల నుంచి తొలగించారు. ప్రమాదం జరిగిన ప్రాంతం 40 కి.మీ. జోన్‌లో ఉండగా, కెవిన్ గంటకు 119 కి.మీ. వేగంతో వాహనం నడుపుతూ జాహ్నవిని ఢీకొట్టాడు. ఆమె 100 అడుగుల దూరం ఎత్తుకు ఎగిరి పడినట్లు గతంలో వార్తలు వచ్చాయి.మరోవైపు ఈ కేసులో సరైన సాక్ష్యాధారాలు లేకపోవడం వల్ల డవేపై అభియోగాలు మోపడం లేదని పేర్కొంటూ, కింగ్ కౌంటీ ప్రాసిక్యూటింగ్ కార్యాలయం ఓ ప్రకటన గతంలో విడుదల చేసింది. సీనియర్ అటార్నీలతో దీని పై విచారణ జరిపిన తర్వాతే ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా జాహ్నవి మృతిని తక్కువ చేస్తూ చులకనగా మాట్లాడిన మరో పోలీస్ అధికారి డేనియల్ ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ లేరని కింగ్ కౌంటీ ప్రాసిక్యూటింగ్ అటార్నీ తెలిపారు. చులకనగా మాట్లాడిన అధికారిపై అప్పట్లో సస్పెన్షన్ వేటు పడిన విషయం తెలిసిందే.

# ఈసారి అత్యధికంగా పోలింగ్ జరగడం మాకు కలిసొస్తుంది!

**'మున్సిపల్'లో సత్తా చాటుతామని కమలం ధీమా**

**పోలింగ్ శాతం పెరగడం తమకు కలిసొస్తుందని బీజేపీ అంచనా**

**మంచి ఓట్లు, సీట్లు సాధిస్తామని బీజేపీ నాయకత్వం ఆశాభావం**

**ప్రధాన పోటీ కాంగ్రెస్, బీజేపీ మధ్యే ఉంటుందని భావన**



మున్సిపల్ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధిస్తామని బీజేపీ పార్టీ ఆశాభావం వ్యక్తం చేస్తోంది. పోలింగ్ సరళిని పరిశీలించిన పార్టీ రాష్ట్ర నాయకత్వం, అత్యధికంగా పోలింగ్ శాతం నమోదవడం తమకు ఈసారి కలిసొస్తుందని భావిస్తోంది. కాంగ్రెస్, బీజేపీ మధ్యే ప్రధాన పోటీ జరిగిందని, అధికార పార్టీ ఎన్ని ప్రలోభాలకు గురి చేసినా మంచి ఓట్లు, సీట్లు సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తోంది.

**మాకూ - కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోటీ :** 2028లో రానున్న సాధారణ ఎన్నికల్లో సత్తా చాటి తెలంగాణలో అధికారమే లక్ష్యంగా పెట్టుకున్న కమలం పార్టీ, మున్సిపల్ ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించింది. అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలు వంటి అనేక అంశాల్లో జాగ్రత్తపడిన బీజేపీ, పుర పోరులో మంచి ఫలితాలు సాధిస్తామని విశ్వాసం వ్యక్తం చేస్తోంది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో బీజేపీకి, కాంగ్రెస్‌కు మధ్యే ప్రధాన పోటీ ఉందని, చాలా మున్సిపాలిటీలు తమ ఖాతాలో చేరడం ఖాయమని పలువురు నేతలు చెబుతున్నారు. పోలింగ్ శాతం పెరగడం తమకు బాగా కలిసి వస్తోందని కాషాయ శ్రేణులు లెక్కలు వేసుకుంటున్నాయి. అర్బన్ ప్రాంతాల్లో బీజేపీకి కొంత పట్టు ఉండటంతో పాటు ప్రభుత్వ వ్యతిరేకత కలిసొచ్చే అంశంగా కమలం నాయకులు అంచనాలు వేస్తున్నారు. విద్యావంతులు, మేధావులు, యువత, మహిళలు బీజేపీకే ఓటు వేశారని లెక్కలు వేసుకుంటున్నారు.

**ఉత్తర తెలంగాణలో 3 కార్పొరేషన్లపై గురి :** ఈసారి నగర కార్పొరేషన్లలోనూ కాషాయ జెండా ఎగురవేస్తామని బీజేపీ నాయకత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది. నిజామాబాద్, కరీంనగర్, మంచిర్యాల కార్పొరేషన్లను చూస్తుండగానే కైవసం చేసుకుంటామని ఘంటాపథంగా చెబుతోంది. మిగతా కార్పొరేషన్లలో అత్యధిక వార్డులను సొంతం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేస్తోంది. గత పురపాలిక ఎన్నికల్లో 2 వేల 997 వార్డులకు గానూ, బీజేపీ 293 వార్డులు సొంతం చేసుకుంది. అమన్‌గల్, మక్తల్ మున్సిపాలిటీలపై కాషాయ జెండా ఎగురవేసి ఏకంగా మున్సిపల్ ఛైర్మన్ స్థానాలను సాధించింది. నాడు బీజేపీకి ఉత్తర తెలంగాణ నుంచి ఒక్క ఎమ్మెల్యే లేని పరిస్థితి. ప్రస్తుతం మాత్రం ఉత్తర తెలంగాణ నుంచి ఏడుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలు, ఇద్దరు ఎమ్మెల్సీలు ప్రాతినిథ్యం వహిస్తుండటంతో మరింత బలం చేకూరింది. ఇది బీజేపీకి బాగా కలిసొచ్చే అంశం.

**20 మున్సిపాలిటీల్లో పాగా! :** ఈసారి పురపోరులో ప్రతి ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయం కోసం చెమటోడ్చారు. దాదాపు 15 నుంచి 20 మున్సిపాలిటీల్లో పాగా వేస్తామని కాషాయ శ్రేణులు పక్కాగా చెబుతున్నాయి. ఉత్తర తెలంగాణతో పాటు దక్షిణ తెలంగాణలోనూ కొన్ని ప్రాంతాల్లో సత్తా చాటుతామని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.కేంద్రమంత్రి బండి సంజయ్ ఈసారి ఎలాగైనా కరీంనగర్ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోవాలని విస్తృతంగా ప్రచారం చేశారు. రెండేళ్ల నుంచి ప్రభుత్వం నగరాలు, పట్టణాలకు నిధులు కేటాయించట్లేదని వ్యూహాత్మకంగా ప్రజల్లోకి వెళ్లారు. 66 డివిజన్లు ఉన్న కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అత్యధిక స్థానాలు అంటే 34 గెలిచి మేయర్ పీఠాన్ని దక్కించుకోవాలని ప్రచారం నిర్వహించారు. బీజేపీని గెలిపిస్తే కేంద్రం నుంచి రూ.500 కోట్ల నిధులను తీసుకువస్తానని బండి సంజయ్ ప్రకటించారు. రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉండి, ప్రభుత్వంపై విమర్శలు చేయడం బీజేపీకి కలిసి వచ్చే అంశంగా మారనుంది.నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో స్థానిక ఎంపీ ధర్మపురి అర్వింద్ మేయర్ పీఠంపై ఎక్కువగా ఫోకస్ చేశారు. గత ఎన్నికల్లో 28 డివిజన్లు గెలిచి మేయర్ పీఠాన్ని కోల్పోయారు. 60 డివిజన్లు ఉన్న నిజామాబాద్‌లో ఈసారి ఎన్నికలు రసవత్తరంగా జరిగాయి. మేయర్ పీఠాన్ని కచ్చితంగా దక్కించుకుంటామని బీజేపీ నాయకులు చెబుతున్నారు.

# పేద విద్యార్థులకు ఉచిత విద్య

**ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు**

**విద్యా హక్కు చట్టం-2009 ప్రకారం ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఒకటో తరగతిలో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు**

**2026-27 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల**

పిల్లల్ని కార్పొరేట్, ప్రైవేట్ బడుల్లో చదివించడం తల్లిదండ్రులకు తలకు మించిన భారమవుతోంది. పేద, మధ్యతరగతి కుటుంబాలు ఫీజులు కట్టలేక సతమతమవుతున్నాయి. అలాంటివారికోసం కూటమి ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. నిరుపేద విద్యార్థులకు పైసా ఖర్చు లేకుండా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఉచితంగా చదువుకునే అవకాశం కల్పిస్తోంది. విద్యా హక్కు చట్టం-2009 ప్రకారం ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయిస్తున్నారు. దీనికి సంబంధించి 2026-27 విద్యా సంవత్సరం ప్రవేశాల నోటిఫికేషన్ విడుదలైంది. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తారు.

ఎవరెవరికి ఎన్ని సీట్లు కేటాయించారంటే

**అనాథలు, హెచ్ఐవీ బాధిత చిన్నారులు - 5 శాతం**

**ఎస్సీలకు - 10 శాతం**

**ఎస్టీలకు - 4 శాతం**

**బీసీ, మైనార్టీ, ఇతరులు - 6 శాతం**

ఐబీ, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ పాఠశాలల్లో ప్రవేశాలకు 2020 ఏప్రిల్ 2 నుంచి 2021 మార్చి 31వ తేదీలోపు జన్మించిన వారు అర్హులు. వీరు దరఖాస్తు చేసుకోవచ్చు. 2020 జూన్ 2 నుంచి 2021 మే 31వ తేదీ మధ్య జన్మించిన వారు స్టేట్ సిలబస్ పాఠశాలల్లో ప్రవేశాలకు అర్హులు. దరఖాస్తు చేసుకునే వారు చిరునామా ధ్రువీకరణ కోసం ఆధార్, రేషన్ కార్డు, ఓటరు ఐడీ, డ్రైవింగ్ లైసెన్సు, ఉపాధి హామీ జాబ్‌కార్డుల్లో ఏదో ఒకటి సమర్పించేందుకు అవకాశం కల్పించారు. వయస్సు ధ్రువీకరణ కోసం బర్త్ సర్టిఫికేట్ తప్పనిసరిగా ఉండాలి. గ్రామ, వార్డు సచివాలయాలు, విద్యా వనరుల కేంద్రాలు, పాఠశాలల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయవచ్చు.లాటరీ తేదీలు ఇవే: పోర్టల్‌లో ఈ నెల 16వ తేదీలోపు ప్రైవేట్ పాఠశాలల నమోదు ప్రక్రియను పూర్తి చేయనున్నారు. విద్యార్థుల నమోదు ప్రక్రియ ఈ నెల 20 నుంచి మార్చి 10వ తారీకు వరకు చేపడతారని సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. మార్చి 17న అర్హత నిర్ధారణ జరుగుతుంది. మార్చి 25న మొదటి విడత లాటరీ, ఏప్రిల్ 12న రెండో విడత లాటరీ నిర్వహిస్తారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని పల్నాడు డీఈవో రామారావు తెలిపారు.పుస్తకాలు, యూనిఫామ్‌లు మీ బాధ్యత - ఫీజులు మా బాధ్యత : విద్యార్థులకు కావలసిన పుస్తకాలు, యూనిఫామ్‌లు మాత్రం తల్లిదండ్రులు భరించాలని, ఫీజులు మాత్రం చెల్లించాల్సిన అవసరం లేదని గతంలోనే సంబంధిత అధికారులు తెలిపారు. సరైన అవగాహన లేకపోవడంతో చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులకు అనుకున్నంత స్థాయిలో ముందుకు రాలేకపోతున్నారని అధికారులు తెలుపుతున్నారు.

# మున్సిపల్ ఎన్నికలు... ఓటర్లకు బంగారు నాణెమంటూ నకిలీ నాణేలు ఇచ్చిన అభ్యర్థి

**సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో విస్తుపోయే ఘటన**

**రాగి నాణేనికి పసిడి పూత పూసిన నాణేలు పంచిన అభ్యర్థి**

**నకిలీ నాణేలు ఇవ్వడంపై ఓటర్ల ఆగ్రహం**

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో విస్తుపోయే ఘటన చోటు చేసుకుంది. రాష్ట్రంలోని ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలలో నిన్న పోలింగ్ ముగిసింది. చెదురు ముదురు ఘటనలు మినహా రాష్ట్రంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఇక ఎన్నికల సమయంలో చాలామంది అభ్యర్థులు అనధికారికంగా ఓటర్లకు నగదు, ఇతర బహుమతులు పంచుతుంటారు. సిరిసిల్ల మున్సిపాలిటీలో ఒక అభ్యర్థి ఇచ్చిన కానుక చర్చనీయాంశంగా మారింది. తమకు గోల్డ్ కాయిన్ అని చెప్పి నకిలీ కానుక ఇచ్చారంటూ సిరిసిల్లలో ఓ వార్డులో ఓటర్లు ఆందోళన వ్యక్తం చేశారు. సదరు అభ్యర్థి ఓట్లు వేయించుకోవడానికి రాగి నాణేలకు పసిడి పూత పూసి వాటిని బంగారు నాణేలుగా ఇచ్చారని పలువురు వాపోయారు. ఓటర్ల ఆగ్రహం నేపథ్యంలో ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై అధికారులు విచారణ చేపట్టారు.

# కేంద్ర మంత్రులను ఆపిన రాహుల్ గాంధీ

**పార్లమెంట్ మీడియా పాయింట్ లో ఆసక్తికర సన్నివేశం**

**మీడియాతో మాట్లాడుతున్న అశ్వినీ వైష్ణవ్, ప్రహ్లాద్ జోషి**

**అదే సమయంలో అక్కడికి వచ్చిన రాహుల్ గాంధీ**

**రాహుల్ రాకతో మధ్యలోనే వెళ్లిపోయిన కేంద్ర మంత్రులు**




పార్లమెంట్ ఆవరణలోని మీడియా పాయింట్ వద్ద బుధవారం ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, ప్రహ్లాద్ జోషి మీడియాతో మాట్లాడుతుండగా రాహుల్ గాంధీ అక్కడికి రావడంతో వారు మధ్యలోనే వెళ్లిపోయారు. కలిసి మాట్లాడుదాం ఉండండంటూ రాహుల్ గాంధీ వారిని ఆపేందుకు ప్రయత్నించారు. అయినా ఆగకుండా వెళుతున్న ప్రహ్లాద్ జోషిని చేయిపట్టుకుని ఆపేందుకు ప్రయత్నించినా ఆయన విడిపించుకుని వెళ్లిపోయారు. ఇదంతా చూసి రాహుల్ గాంధీతో పాటు ఆయన వెన్నంటి ఉన్న సహచర ఎంపీలు నవ్వడం వీడియోలో కనిపిస్తోంది.కాంగ్రెస్ నేత సుప్రియా శ్రీనటే ఈ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ.. సభలో రాహుల్ గాంధీ అన్నీ అబద్ధాలే మాట్లాడారంటూ కేంద్ర మంత్రులు మీడియా ముందు ఆరోపించారని చెప్పారు. అప్పుడే అక్కడికి వచ్చిన రాహుల్ గాంధీ, ఇదే విషయంపై కలిసి మాట్లాడుదామని అనగానే కేంద్రమంత్రులు అక్కడి నుంచి పలాయనం చిత్తగించారని విమర్శించారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

**ప్రధానిపై ఒత్తిడి.. రాహుల్ గాంధీ**

అనంతరం రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడుతూ.. ఎప్ స్టీన్ ఫైల్స్ లో హర్దీప్ సింగ్ పూరి, అనిల్ అంబానీల పేర్లు ఉన్నాయని చెప్పారు. ఈ విషయంలో ప్రధాని మోదీపై ఒత్తిడి తీసుకొచ్చారని, అందుకే ఆయన అమెరికా ట్రేడ్ డీల్ కు అంగీకరించారని ఆరోపించారు. లేదంటే ఏ ప్రధాన మంత్రి కూడా సాధారణంగా ఇలాంటి ట్రేడ్ డీల్ కు అంగీకరించరని విమర్శించారు. రైతులు, డేటా, ఎనర్జీ సెక్యూరిటీ.. తదితర ప్రయోజనాలను తాకట్టు పెట్టి ఏ ప్రధాని కూడా ట్రేడ్ డీల్ కుదుర్చుకోరని రాహుల్ గాంధీ అన్నారు.

## రోగ నిరోధక వ్యవస్థ.. అపోహలు-నిజాలు

**అపోహ: విటమిన్ సి తీసుకుంటే జలుబు తగ్గుతుంది.**



**వాస్తవం:** విటమిన్ సి రోగ నిరోధక వ్యవస్థ (ఇమ్యూనిటీ) పనితీరుకు అండగా నిలుస్తుంది. కానీ, ఆరోగ్యవంతులైన పెద్దల్లో సాధారణ జలుబును నివారించలేదని అధ్యయనాలు తెలుపుతున్నాయి. విటమిన్ సి లోపం రోగ నిరోధక వ్యవస్థను బలహీనపర్చవచ్చు కానీ, సప్లిమెంట్లు తీసుకున్నంత మాత్రాన వైరల్ ఇన్ఫెక్షన్లను అడ్డుకోలేదు. అయినప్పటికీ, కొన్ని పరిశోధనల ప్రకారం జలుబుగా ఉన్నప్పుడు రోజుకు 2 గ్రాముల విటమిన్ సి తీసుకుంటే దాని తీవ్రత 20 శాతం వరకు తగ్గించగలదు. కాబట్టి, నివారణ చర్యగా ముందుగా తీసుకునే కంటే జబ్బుగా ఉన్నప్పుడు విటమిన్ సి తీసుకుంటే మరింత ప్రభావం చూపుతుంది.

**అపోహ:** పరిశుభ్రత (హైజీన్) రోగ నిరోధక వ్యవస్థను బలహీన పరుస్తుంది.

వాస్తవం: మన శరీరం లోపల, శరీరంపై ఉండే సూక్ష్మజీవుల సమూహంలో మార్పులకు అలర్జీతో వచ్చే వ్యాధులు పెరగడానికి లంకె ఉంటుంది. మంచి బ్యాక్టీరియాను పోషించుకోవడం అత్యవసరం. అయితే, అతిసారం, న్యుమోనియా వంటి హానికరమైన ఇన్ఫెక్షన్ల నుంచి కాపాడుకోవడానికి చేతులు కడుక్కోవడం, నాణ్యమైన ఆహారం తినడం లాంటి పరిశుభ్రతకు సంబంధించిన అలవాట్లు పాటించాల్సిందే. అలాగని అతికి పోకుండా కనీస శుభ్రత పాటించడం మాత్రం మర్చిపోకండి.

**అపోహ:** టీకాల కంటే సహజ రోగ నిరోధకతే మంచిది.

వాస్తవం: ఇన్ఫెక్షన్ సోకిన తర్వాతనే శరీరంలో సహజ నిరోధకత అభివృద్ధి చెందుతుంది. అయితే సహజ నిరోధకత కొన్ని ఇబ్బందులతో వస్తుంది. పైగా ఒక వ్యక్తి నుంచి మరో వ్యక్తికి వేర్వేరుగా ఉంటుంది. అధ్యయనాల ప్రకారం టీకాలు వ్యాధుల ప్రమాదం లేకుండా బలమైన, లక్షిత రోగ నిరోధకతను అందిస్తాయి. కాబట్టి, ఇన్ఫెక్షన్ మీద ఆధారపడటం కంటే టీకాలతో సురక్షితమైన, నమ్మకమైన ఇమ్యూనిటీని సమకూర్చుకోవచ్చు.

**అపోహ:** వయసు పెరుగుతుంటే రోగ నిరోధకత తగ్గుతుంది.

వాస్తవం: రోగ నిరోధకత అన్నిసార్లూ వయసుతోపాటు తగ్గిపోదు. వయసుతోపాటు ఇమ్యూనిటీ వైఫల్యానికి కారణమయ్యే ఇమ్యునోసెనెసెన్స్ కారణంగా కొత్త ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా ప్రతిస్పందించే సామర్థ్యం తగ్గొచ్చు. కానీ, పెద్దలు పాత ఇన్ఫెక్షన్లు, టీకాల కారణంగా అభివృద్ధి చెందిన జ్ఞప్తి కణాలను (మెమరీ సెల్స్) నిలిపి ఉంచుకోగలరు. అలా ఇవి గతంలో పోరాడిన రోగ కారక క్రిములకు వ్యతిరేకంగా రక్షణ కల్పిస్తాయి.

## రోజుకు అసలు ఎన్ని కోడిగుడ్లను తింటే మంచిది..?



మనం ఆరోగ్యంగా ఉండాలంటే అందుకు ఆరోగ్యకరమైన ఆహారాలను తినాల్సి ఉంటుందన్న విషయం అందరికీ తెలిసిందే. కానీ నేటి ఉరుకుల పరుగుల బిజీ యుగంలో చాలా మంది జంక్ ఫుడ్‌కు అలవాటు పడ్డారు. ఉదయం బ్రేక్‌ఫాస్ట్ మొదలుకొని రాత్రి తినే డిన్నర్ వరకు జంక్ ఫుడ్‌నే ఎక్కువగా తింటున్నారు. అలాగే వేళ తప్పించి భోజనం చేస్తున్నారు. రాత్రి పూట కూడా ఆలస్యంగా ఆహారం తీసుకుంటున్నారు. ఇదంతా అస్తవ్యస్తమైన జీవనశైలి కిందకు వస్తుంది. దీంతో ఆరోగ్య సమస్యలను చేజేతులా కొని తెచ్చుకుంటున్నారు. అందుకనే ఆరోగ్యవంతమైన ఆహారాలను తినాలని పోషకాహార నిపుణులతోపాటు ఆరోగ్య నిపుణులు కూడా మనకు సూచిస్తుంటారు. ఇక ఆరోగ్యవంతమైన ఆహారాల విషయానికి వస్తే కోడిగుడ్లు ముఖ్య పాత్ర పోషిస్తాయని చెప్పవచ్చు.

### ప్రోటీన్లు అధికం..

రోజుకు కనీసం ఒక కోడిగుడ్డును ఉడకబెట్టి తింటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు. కోడిగుడ్లలో ప్రోటీన్లు అధిక మొత్తంలో ఉంటాయి. ఒక కోడిగుడ్డును తింటే మనకు సుమారుగా 6 గ్రాముల మేర ప్రోటీన్లు లభిస్తాయి. ఇవి కండరాలకు శక్తిని, పోషణను అందిస్తాయి. దీంతో మనం చురుగ్గా ఉంటాం. ఉత్సాహంగా పనిచేస్తాం. ఉదయం బ్రేక్‌ఫాస్ట్ రూపంలో కోడిగుడ్డును తింటే రోజంతా యాక్టివ్‌గా ఉండవచ్చు. ఎంత పనిచేసినా అలసిపోకుండా ఉంటారు. అలాగే కోడిగుడ్లలో కోలిన్ అనే పోషక పదార్థం సమృద్ధిగా ఉంటుంది. ఇది కణాల పనితీరుకు సహకరిస్తుంది. లివర్ పనితీరును మెరుగు పరుస్తుంది. శరీరంలోని కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తుంది. కోలిన్ వల్ల శరీరంలో అసిటైల్ కోలిన్ ఉత్పత్తి అవుతుంది. ఇది మన మెదడు పనితీరుకు, జ్ఞాపకశక్తికి, ఏకాగ్రతకు, కండరాల పనితీరుకు ఎంతగానో సహాయ పడుతుంది. కనుక కోడిగుడ్లను తింటే మెదడును యాక్టివ్ గా ఉంచుకోవచ్చు.

### కంటి చూపు మెరుగు పడుతుంది..

కోడిగుడ్లలో యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఎక్కువగానే ఉంటాయి. ముఖ్యంగా లుటీన్, జియాజాంతిన్ అనే యాంటీ ఆక్సిడెంట్లు గుడ్లలో సమృద్ధిగా ఉంటాయి. ఇవి కళ్లను సూర్యుని నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల బారి నుంచి రక్షిస్తాయి. దీంతో కళ్లలో శుక్లాలు రాకుండా చూసుకోవచ్చు. వయస్సు మీద పడడం వల్ల కంటి చూపు తగ్గడం అనే సమస్య వస్తుంది. దీన్ని కూడా రాకుండా నివారించవచ్చు. కోడిగుడ్లలో సెలీనియం అధిక మొత్తంలో ఉంటుంది. ఇది శరీర రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. దీంతో సీజనల్ వ్యాధుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇలా కోడిగుడ్లను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

## బీ అలర్ట్.. నకిలీ ఆధార్ కార్డులు.. ఎలా గుర్తించాలంటే..




దేశంలో ఆధార్ ఎంత కీలకమైన గుర్తింపు కార్డో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అలాంటిది ఆర్థిఫిషియల్ ఇంటెలిజెన్స్ (%ూ×%) టెక్నాలజీని దుర్వినియోగం చేస్తూ కొందరు నేరగాళ్లు ఎలాన్ మస్క్, ట్రంప్, ఆర్యభట్ట ఇలా ఎవరి పేరుతో కావలిస్తే వారి పేరుతో ఆధారు గుర్తింపు కార్డులు సృష్టిస్తూ జనాలను దోచుకునేందుకు కొత్త దోపిడీకి తెర తీశారు. ఆధార్ అనేది 12 అంకెల ప్రత్యేక గుర్తింపు కార్డు. దీనిని భారత ప్రభుత్వం ప్రతి పౌరుడికి జారీ చేస్తుంది. పిల్లలు లేదా పెద్దలు ఎవరికైనా ఈ గుర్తింపు పత్రం తప్పనిసరిగా ఉండి తీరాలి. స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే విద్యార్థుల కోసం, బ్యాంకు అకౌంట్లు, ప్రభుత్వ పథకాలు, లావాదేవీలు, ధృవీకరణ పత్రాలు, టికెట్ బుకింగ్.. ఇలా అనేక అవసరాల కోసం ఐడెంటిటీ ప్రూఫ్‌గా ఆధార్ సమర్పించాల్సిందే. జీవితంలో విద్య, ఆర్థిక, వ్యాపారలావాదేవీలతో కచ్చితంగా లింక్ అయి ఉండే ఆధార్ కార్డును.. కృతిమ మేధ(%ూ×%)ను వాడుకుని నకిలీలను సృష్టిస్తున్నారు సైబర్ నేరగాళ్లు. దీంతో ప్రజల్లో కొత్త ఆందోళనలు మొదలయ్యాయి. అందుకే వెంటనే నకిలీలను ఎలా గుర్తించాలో తెలుసుకుని జాగ్రత్తపడండి.

## తన చిత్రాల రూపంలో.. శాంతినికేతన్‌ను
# హైదరాబాద్‌కు తెచ్చిన కొండపల్లి శేషగిరిరావు





నేడు కొండపల్లి శేషగిరిరావు శత జయంతి

విశ్వకవి రవీంద్రనాథ్ టాగోర్ 1933లో హైదరాబాద్ వచ్చారు. తాను 1901లో స్థాపించిన శాంతినికేతన్ (విశ్వభారతి) ఒడిదుడుకులలో ఉన్నది. నిర్వహణకు అవసరమైన నిధులు ఇప్పిస్తానని నిజాం కార్యనిర్వాహక మండలి సభ్యుడు నవాజ్ మెహదీ నవాబ్ జంగ్ హామీ ఇస్తూ ఆహ్వానించినందుకు హైదరాబాద్ వచ్చారు. నిజాం రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. ఆ సందర్భంగా ఇప్పటి బంజారాహిల్స్ ప్రాంతంలో జంగ్ అతిథి గృహంలో రవీంద్రుడు కొద్ది రోజులున్నారు. ఆ పరిసరాలకు ముగ్ధుడైన రవీంద్రుడుబీ ముందే వచ్చి ఉంటే ఇక్కడే శాంతినికేతన్ స్థాపించేవాడిని అని జంగ్‌తో అన్నారు. రవీంద్రుడు శాంతినికేతన్‌ను హైదరాబాద్‌లో స్థాపించలేకపోయారు కానీ, శాంతినికేతన్‌ను కొండపల్లి శేషగిరిరావు హైదరాబాద్‌కు తెచ్చారు తన చిత్రాల రూపంలో! కొండపల్లి హృదయమూ, వారు భావితరాల కోసం పదిలపరిచిన చిత్రాలు శాంతి నికేతనాలే!


'సరస రేఖా చిత్ర
సాహిత్యమును గూర్చిన
నీదు కుంచియకు
అభివాదమయ్యా,
అప్సరసల భువిని
అవతరింపగజేయు మాంత్రికా నీకు నమస్సులయ్యా..'

దాశరథి కృష్ణమాచార్య పద్య పాదాలతో కొండపల్లికి సుమాంజలి%ొ

పాత వరంగల్ జిల్లా, మానుకోట (మహబూబాద్) దగ్గరలోని పెనుగొండలో 1924, జనవరి 27న కొండపల్లి జన్మించారు. బొమ్మలు వేయ డం పుట్టుకతో వచ్చిన అభిరుచి. రామప్ప శిల్పాలు, పాకాల పరిసరాలు స్కెచెస్‌గా వేసేవారు. పెన్సిల్-పేపర్‌తో హైదరాబాద్ వచ్చారు. ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో పెయింటింగ్స్ నేర్చారు. రవీంద్రుడి మిత్రుడు మెహదీ నవాజ్‌జంగ్ కొండపల్లి చిత్రాలకు ముగ్ధుడై శాంతినికేతన్‌లో చేరేందుకు తోడ్పడ్డారు. ప్రపంచ నగరాల్లో నవ వధువుగా ప్రఖ్యాతిచెందిన హైదరాబాద్ కొండపల్లి శాంతినికేతన్ వెళ్లేప్పుడు ప్రశాంతంగా ఉన్నది. రైల్లో తిరిగి వచ్చే సందర్భంలో శ్రీవైష్ణవుడైన కొండపల్లికి రజాకార్ల దుష్కృత్యాలు 1948లో అనుభవంలోకి వచ్చా యి. ఒక సహ ప్రయాణికుడు 'ఎవరనుకున్నావు? నవాజ్‌జంగ్ స్నేహితుడు' అనడంతో ఆపద తప్పింది. స్వతహాగా గాంధేయవాది అయిన కొండపల్లిపై రావి నారాయణరెడ్డి, వట్టికోట, దాశరథి, కాళోజీ తదితరుల ప్రభావం పడింది. కొండపల్లి జల-తైల వర్ణాల్లో సామ్యవాద ఛాయలూ కనిపిస్తాయి. తాను చదివిన ఫైన్ ఆర్ట్స్ కళాశాలలోనే అధ్యాపకులుగా పనిచేశారు. ఎందరో చిత్రకారులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా స్ఫూర్తినిచ్చిన కొండపల్లి తన చిత్రాల ద్వారా గాడ్స్ పెయింటర్ అనే ప్రశస్తి పొందారు. ఆంధ్ర దేశంలో చిత్రకళ-తెలంగాణలో చిత్రకళ, కళ-కల్పనా వైచిత్రి వంటి రచనలు చేశారు. జానపద చిత్రకళను పరిచయం చేస్తూ పరిశోధనాత్మక వ్యాసాలు రాశారు. తెలుపు-నలుపు చిత్రాలు, మ్యూరల్స్ ఎన్నింటినో చిత్రించారు. అసంఖ్యాక అవార్డులు పొందారు. ఎమరిటస్ మేడం ఫుకు అకినో, బిశ్వనాథ్ ముఖర్జీ, ఎ.ఎస్.రామన్, పీటర్ స్వీజ్, ఎన్.ఎస్.బింద్రే, అనితారాయ్ చౌదరి, వై.వి.శుక్ల, ఎ.పెరుమాళ్ వంటి ఎందరో ప్రముఖులు వీరిని అభిమానించేవారు. హైస్కూల్ విద్యార్థి దశలో నేను కొన్న తొలి పత్రిక ఆంధ్రపత్రిక వీక్లీ. లైబ్రరీలో (1969-70) ఆ పత్రికను చూశాను. ముఖచిత్రం పోతన. ఆ సుకవి అక్షరాలు చిత్రరూపం ధరిస్తే అవి కొండపల్లి శేషగిరిరావు బొమ్మలే! కొండపల్లితో తొలి పరిచయం 1994లో. అదీ చిత్రంగా జరిగింది. ఉదయం పొలిటికల్ బ్యూరో రిపోర్టర్‌గా 1992లో హైదరాబాద్ వచ్చాను. రాంనగర్ వాసినయ్యాను. మనింటి దగ్గరలోనే ఉంటారని మిత్రులు లక్ష్మణరావు జి.కృష్ణకు నన్ను పరిచయం చేస్తున్నారు. మాటల్లో మాటగా గుఱ్ఱం మల్లయ్య (1904-1984)కు బంధువు అని అన్నారు. అది రాశాడు, ఇది రాశాడు అని సోది చెబుతావేం? ఫలానా వారితో బంధుత్వం ఉన్నవాడు అనే ముక్క చెప్పకుండా! అన్నారు జి.కృష్ణ. వారిపై నేనొక వ్యాసం రాస్తాను, రేపు ఉదయం మీ ఇంటికి వస్తానన్నారు జి.కృష్ణ. మరుసటి ఉదయం నిద్ర లేవకముందే తలుపు తట్టారు. చేతిలో నోట్‌బుక్, పెన్ను! గుఱ్ఱం మల్లయ్య వాటర్ కలర్ పెయింటింగ్స్ వరదకు తడిచి శిథిలావస్థలో ఉన్నాయని చెప్పినపుడు కలవరం చెందారు. ప్రదర్శిద్దాం, నా వంతు చేయి వేస్తానన్నారు, సిగ్గనిపించింది. రెండేండ్ల తర్వాత పీఎఫ్ అడ్వాన్స్ లోన్ తీసుకొని పెయింటింగ్స్ ఫ్రేమ్ చేయించి కృష్ణకు చూపించాను. ఎవరిని పిలుద్దామని అడిగాను. ఇంకెవరు కొండపల్లి శేషగిరిరావునే అన్నారు. ఆ సందర్భంగా కొండపల్లి నివాసంలో శాంతినికేతన్ చూశాను. "స్వతహాగా గాంధేయవాది అయిన కొండపల్లిపై రావి నారాయణరెడ్డి, వట్టికోట, దాశరథి, కాళోజీ తదితరుల ప్రభావం పడింది. కొండపల్లి జల-తైల వర్ణాల్లో సామ్యవాద ఛాయలూ కనిపిస్తాయి. తాను చదివిన ఫైన్ ఆర్ట్స్ కళాశాలలోనే అధ్యాపకులుగా పనిచేశారు. ఎందరో చిత్రకారులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా స్ఫూర్తినిచ్చిన కొండపల్లి తన చిత్రాల ద్వారా గాడ్స్ పెయింటర్ అనే ప్రశస్తి పొందారు." బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 1994 ఆగస్టు 9న గుఱ్ఱం మల్లయ్య పెయింటింగ్స్ మూడు రోజుల ఎగ్జిబిషన్ ప్రారంభించారు కొండపల్లి. ఆ సమావేశంలో జి.కృష్ణ, రాంభట్ల కృష్ణమూర్తి, దరువూరి వీరయ్యలు కూడా ప్రసంగించారు. శాంతినికేతన్‌లో తనకు సీనియర్ అయిన గుఱ్ఱం మల్లయ్య, వారికి సీనియర్ అయిన మైసూర్ సంస్థానం చిత్రకారుడు వెంకటప్పయ్యల శైలి గురించి చెప్పారు. వారికి, తనకు విద్యార్థులుగా రెండు దశాబ్దాల తేడా ఉన్నదని, మా అందరికీ అవనీంద్ర నాథ్ టాగోర్-నందలాల్ బోస్‌లు అధ్యాపకులు కావడం సారూప్యత అని తెలిపారు. తొలితరం ఆధునిక తెలుగు చిత్రకారులకు స్వాతంత్ర్యానికి పూర్వం లభించిన గౌరవం ఆ తర్వాత కనుమరుగైందన్నారు. చలసాని ప్రసాదరావు, ఏలె లక్ష్మణ్, శ్రీధర్, వంటి చిత్రకారులు, శివాజీ, కిషోర్ తదితర జర్నలిస్టులు, జేఎన్‌టీయూ విద్యార్థులు పాల్గొన్న ఆ సభలో కొండపల్లి తన ముందుతరాల విశిష్టతను పరిచయం చేశారు. రుషులకు సెల్ఫ్ అప్రైజల్ ఉండదు కదా. ఇది కొండపల్లి శేషగిరిరావు శత జయంతి సందర్భం. చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో 25వ తేదీ నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు పెయింటింగ్స్ ప్రదర్శిస్తున్నారు. వారు మన కోసం పదిలపరచిన వ్యాసుడు-గణపతి, రాఘవుడు-గుహుడు, వరూధిని-ప్రవరాఖ్య, మురారి, శకుంతల, గోదాదేవి, అభినవ గుప్తుడు, రామప్ప శిల్పాల వంటి అసంఖ్యాక చిత్రాల్లో ఎంపిక చేసిన చిత్రాలు కొలువై ఉన్నాయి. కలువల కొలనులో కలువ కనుల సుందరి, పల్లెల రమణీయత, ప్రకృతి దృశ్యాలు, ముఖ్యంగా తెలంగాణ వైవిధ్య జీవితం ఆహ్లాదపరుస్తాయి.

# దాగని సత్యం

'దేవుని ఎదుట ప్రమాణం చేసి అంతా నిజమే చెప్తాను. అబద్ధం చెప్పను' అని అందరూ సత్యమే చెబుతారనుకుంటే అంతకంటే వెర్రితనం ఉండదు. కానీ, వెనుకబడిన గ్రామాల్లో ప్రమాణం చేస్తే సత్యమే పలుకుతారన్న నమ్మకం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. ఇందులో ఎలాంటి శాస్త్రీయత ఉండదు. కాబట్టే కొంతమంది పెద్దలు తమ స్వార్థం కోసం ఇప్పటికీ ఆ ప్రజల నమ్మకాన్ని అనుకూలంగా మలుచుకుంటున్నారు. 'ముల్లును ముల్లుతోనే తీయాలి' అన్న 'శాస్త్రంగా' పెద్దల దుష్టబుద్ధిని నాటకీయంగా బయట పెట్టింది ఈ 'అ-సత్యం' నాటిక. తెరతీయగానే ఊళ్లో సత్తెమ్మ తల్లి ఎదుట, ఊరి పెద్దలు, ప్రజల ఎదుట.. 'బుచ్చమ్మ గారి చిన్నబ్బాయి దగ్గర, తొలకరి జల్లుల్లో లక్ష రూపాయల రొక్కం చేబదులు తీసుకున్న మాట నిజం. తర్వాత రెండు నెలలకే నేను ఆ సొమ్ము చిన్నబ్బాయికి తిరిగి ఇచ్చేసాను. ఇది సత్తెం. ఇది సత్తెం. ఇది సత్తెం' అని వెంకట్రావు అనే సామాన్య రైతు ప్రమాణం చేసి దీపం ఆర్పుతాడు. వెనువెంటనే పక్షవాతంతో మెలితిరిగిపోతూ కూలబడిపోతాడు. వెంకట్రావు అబద్ధం చెప్పాడు కనుకనే ఇలా అయిపోయాడని ఊరి జనమంతా అనుకుంటారు. కానీ, శివయ్య అనే పెద్ద మనిషికి వెంకట్రావు నిజాయతీ తెలుసు. కాబట్టి చిన్నబ్బాయే మోసం చేసి ఉంటాడని భావించాడు. చిన్నబ్బాయి అన్న పెద్దబ్బాయి భార్య గర్భవతి అవుతుంది. పెద్దబ్బాయి కాస్త అమాయకుడు. అతని భార్య మూగ. దీన్ని ఆసరాగా చేసుకొని యావదాస్తినీ చిన్నబ్బాయే అనుభవిస్తుంటాడు. ఇప్పుడు అన్నకు కొడుకు పుడితే, తన పెత్తనానికే ఆటంకం ఏర్పడుతుందని, ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందన్న బాధ పట్టుకుంటుంది. అమాయకురాలైన వదినపై లేనిపోని అభాండాలు వేస్తాడు చిన్నబ్బాయి. 'ఇంత పెద్ద వయసులో గర్భం దాల్చడమేంటి?' అని నానా పుకార్లు పుట్టిస్తాడు. ఈ దుష్ట పన్నాగంలో చిన్నబ్బాయికి ఊరి సర్పంచ్ మొదటి నుంచి సహకరిస్తుంటాడు. చిన్నబ్బాయి పుకార్లతోనే ఆపకుండా, ఓ అర్ధరాత్రి వేళ అన్నలేని సమయంలో ముసుగు వేసుకుని వచ్చి వదినపై పెట్రోలు పోసి నిర్దాక్షిణ్యంగా సజీవ దహనం చేస్తాడు. ఆమె హాహాకారాలు చేస్తూ మరణిస్తుంది. ఆ సమయంలో చిన్నబ్బాయి మొలలోని తాళాల గుత్తి అక్కడ పడిపోతుంది. ఆ కంగారులో ఆయన ఈ విషయాన్ని గుర్తించకుండానే పారిపోతాడు. అభాండాలు తట్టుకోలేక వదిన ఆత్మహత్యకు పాల్పడిందని చిన్నబ్బాయి ప్రచారం చేస్తాడు. భార్య మరణాన్ని తట్టుకోలేక ఊరు విడిచిపోవాలని నిర్ణయించుకుంటాడు పెద్దబ్బాయి. ఓ రోజు అర్ధరాత్రి శివయ్య ఇంటికి వచ్చి తన బాధనంతా చెప్పుకొని బావురుమంటాడు. 'ఆస్తి చాలా పాపిష్టిది మావా! అయిన వాళ్లను కూడా పొట్టన పెట్టుకుంటుంది. ఇవి నా పొలం కాగితాలు. నీ వద్దే ఉంచు. ఇవి మా ఇంటి బోషాణం పెట్టి తాళాలు. తీసుకో, మనం కలుసుకున్నట్టు ఎవరికీ తెలియకూడదు. రహస్యంగానే ఉండాలి. మళ్లీ తిరిగి వచ్చినప్పుడే ఇవి తీసుకుంటాను. అప్పటివరకు నా ఆస్తి నీదే' అంటూ భార్యను తలుచుకుంటూ ఏడుస్తూ ఎటో వెళ్లిపోతాడు పెద్దబ్బాయి. శివయ్యకు విషయం అంతా బోధపడింది. ఇక తను కథను నడిపిస్తాడు. పెద్దబ్బాయి పొలం కాగితాలు తన వద్ద తాకట్టుపెట్టి పాతిక లక్షలు అప్పు తీసుకున్నాడని, ఆ డబ్బు తిరిగి ఇస్తే పొలం కాగితాలు ఇస్తానని చిన్నబ్బాయికి కబురు చేస్తాడు శివయ్య. చిన్నబ్బాయి కాగితాలు చూసి నిర్ఘాంతపోతాడు. తన అన్న అప్పు తీసుకున్నట్టు శివయ్య ఊరి జనం సమక్షంలో సత్తెమ్మ తల్లి వద్ద ప్రమాణం చేయాలని చిన్నబ్బాయి అడుగుతాడు. శివయ్య సరేనంటాడు. అన్నట్టే ప్రమాణం చేసి డబ్బు తీసుకుంటాడు. అప్పుడు తాళాల గుత్తి కూడా చిన్నబ్బాయికి ఇస్తాడు. తన దుర్మార్గ రహస్యం బయటపడటంతో చిన్నబ్బాయికి ఆందోళనతో పక్షవాతం వచ్చి కాలు చేయి పడిపోతుంది. ఆయన ఇచ్చిన పాతిక లక్షల సొమ్మును తను వాడుకోకుండా ఇంటి పక్కనే ఉండే ఓ కూలీకి ఇస్తాడు. ఆ కూలీ పసిబిడ్డ దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స కోసం ఉచితంగా ఇస్తాడు. 'పెద్దబ్బాయి మూగ భార్య కడుపులో కాలిపోయిన పసిగుడ్డు, ఈ పసివాడి నవ్వులో జీవం పోసుకోవాలి' అంటుండగానే తెరపడుతుంది. 'సాటి ప్రాణులకు ఏది మంచిదో అదే సత్యం' అన్న సందేశంతో నాటిక ముగుస్తుంది. అజో %-% విభో %-% కందాళం వారు, జాషువా సాంస్కృతిక వేదిక సంయుక్తంగా ఇటీవల విజయవాడలో నిర్వహించిన 2025 కథా నాటికల పోటీలో ఈ నాటిక ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. నాటిక ఆద్యంతం ఉద్విగ్నభరితంగా సాగడానికి సంగీతం ప్రాణంగా నిలిచింది. ఉత్తమ ప్రదర్శనతోపాటు ఉత్తమ దర్శకత్వం, ఉత్తమ సంగీతం బహుమతులను కూడా ఈ నాటిక గెలుచుకున్నది.



## స్పెషల్ టెస్టులు అవసరమా?



మా పాపకు తొమ్మిది నెలలు. వారం క్రితం బాగా జ్వరం వచ్చింది. డాక్టర్ దగ్గరికి తీసుకుపోతే మందులు రాశారు. తగ్గలేదు. జ్వరం తప్ప జలుబు, దగ్గు వంటి వేరే ఇబ్బందులేవీ లేవు. మూత్రపరీక్ష చేయిస్తే యూరిన్ ఇన్ఫెక్షన్ ఉందని రిపోర్ట్ వచ్చింది. డాక్టర్ యాంటిబయాటిక్ మందులు ఇచ్చారు. అవి వాడిన తర్వాత జ్వరం పూర్తిగా తగ్గింది. పాప హుషారుగానే ఉంది. డాక్టర్‌కి చూపించినప్పుడు యూరిన్ ఇన్ఫెక్షన్ ఉంది కాబట్టి అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేయించమన్నారు. అది కూడా చేయించాం. ఆ తర్వాత మూత్రం వెనక్కి పోతుందనే సందేహం ఉంది.. కాబట్టి మరో స్కాన్ చేయాలంటున్నారు. నిజంగా అది అవసరమా? మీరు చెప్పిన వివరాల ప్రకారం మీ బిడ్డకు యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ (యూటీఐ) ఉంది. చిన్నపిల్లల్లో ఇలాంటి సమస్య ఉంటే ఇన్ఫెక్షన్ ఎక్కడ ఉందో తెలుసుకోవడానికి అల్ట్రా సౌండ్ స్కాన్ చేస్తారు. ఈ స్కాన్ ద్వారా ఇన్ఫెక్షన్ కిడ్నీల్లో ఉందా? మూత్రనాళాల్లో ఉందా? కేవలం మూత్రాశయంలో ఉందా? అనేది తెలుస్తుంది. కొంతమందిలో అరుదుగా పుట్టుకతోనే మూత్ర విసర్జక వ్యవస్థ నిర్మాణంలో లోపాలు ఉంటాయి. అలాంటి సమస్యలు ఏవైనా ఉంటే అల్ట్రా సౌండ్ పరీక్షలో తెలుస్తాయి. ఈ పరీక్ష చేశారు. కాబట్టి మీ బిడ్డకు ఇన్ఫెక్షన్ ఎక్కడ ఉందో డాక్టర్‌కు తెలిసే ఉంటుంది. కానీ, ఆ ఇన్ఫెక్షన్‌కు కచ్చితమైన కారణం కూడా తెలియాలి. సాధారణంగా కిడ్నీలు రక్తాన్ని శుద్ధి చేసి నీరు, వ్యర్థాలను వడపోస్తాయి. కిడ్నీల్లో మూత్రం నాళాల ద్వారా కిందికి వచ్చి మూత్రాశయానికి చేరుతుంది. ఆ మూత్రాశయం నుంచి జననాంగంలోని మూత్రనాళం ద్వారా బయటికి పోతుంది. కొంతమంది పిల్లల్లో పుట్టుకతోనే మూత్ర విసర్జన సమస్య ఉంటుంది. మూత్రాశయం నుంచి వ్యతిరేక దిశలో మూత్రం ప్రయాణిస్తుంది. వెసికో యూరెటెరిక్ రిఫ్లక్స్ అంటాం. ఈ సమస్య ఉన్నట్టయితే బిడ్డకు యూరిన్ ఇన్ఫెక్షన్ తగ్గినా తర్వాత రాకుండా ఉండేందుకు కూడా కొద్ది మోతాదులో యాంటిబయాటిక్ మందులు వాడాల్సి ఉంటుంది. దాదాపు రెండు సంవత్సరాల వయసు వరకు వాడాలి. రెండేళ్ల వయసు దాటిన తర్వాత సమస్య ఉన్నదీ, లేనిదీ మెచ్యురేటింగ్ సిస్టో యురెత్రోగ్రామ్ (ఎంసీయూజీ) పరీక్ష ద్వారా తెలుసుకుంటారు. మూత్రం వచ్చే మార్గంలో ట్యూబ్ పెట్టి, రంగు నీటిని అందులోకి పంపుతారు. ఆ నీరు మూత్రనాళంలో దిగువకు కాకుండా పైకి ప్రయాణిస్తే ఎంసీయూజీ పరీక్షలో గుర్తించవచ్చు. మీ పాపకు బహుశా ఎంసీయూజీ పరీక్ష చేయాలని వైద్యులు సూచించి ఉండవచ్చు. ముందు బిడ్డకు వెసికో యురెటెరిక్ రిఫ్లక్స్ సమస్య ఉందా? లేదా? తెలుసుకోవాలి. ఉంటే యాంటిబయాటిక్ మందులు వాడి సమస్యను తగ్గించుకోవచ్చు. యూరిన్ ఇన్ఫెక్షన్ రాకుండా బిడ్డకు నీళ్లు బాగా తాగించాలి. న్యాపీ వాడుతున్నట్లయితే సమయానికి మార్చాలి. న్యాపీ తీసిన తర్వాత వెనక భాగం తర్వాత ముందు భాగం శుభ్రం చేయకుండా, ముందు భాగం నుంచి వెనక్కి శుభ్రం చేయాలి.

# పాన్ ట్రాన్సాక్షన్ లిమిట్ పెంపు!

**డిపాజిట్లు, ఆస్తులు, వాహనాల కొనుగోలుకు ఊరట!**

**ఏప్రిల్ 1 నుంచే అమలు!**

**న్యూ ట్యాక్స్ రూల్స్ 2026తో మధ్యతరగతి ప్రజలకు, చిరు వ్యాపారులకు ఊరట**

**ఏప్రిల్ 1 నుంచే అమలు**




సామాన్యులు, చిరువ్యాపారులకు గుడ్ న్యూస్. పాన్ ట్రాన్సాక్షన్స్ లిమిట్ పెంచుతూ ఆదాయ పన్ను శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం దశాబ్దాల కాలం నాటి నిబంధనల స్థానంలో 'ఆదాయపు పన్ను నిబంధనలు, 2026' పేరుతో కొత్త ముసాయిదాను ప్రవేశపెట్టింది. మధ్యతరగతి ప్రజలకు, చిరు వ్యాపారులకు ఊరట కలిగించడంతోపాటు, బ్యాంకింగ్, వ్యాపార లావాదేవీలు మరింత సరళతరం చేయడమే లక్ష్యంగా ఈ ముసాయిదా ప్రతిపాదనలు చేసింది.

### బ్యాంకింగ్ లావాదేవీలు- పరిమితి పెంపు

ప్రస్తుత నిబంధనల ప్రకారం, బ్యాంక్ లేదా పోస్టాఫీస్‌లో ఒక రోజుకు రూ.50వేలు కంటే ఎక్కువ నగదు డిపాజిట్ చేస్తే పాన్ కార్డు ఇవ్వడం తప్పనిసరి. అయితే కొత్త ముసాయిదాలో ఈ రోజు వారీ పరిమితిని తొలగించి, వార్షిక పరిమితిని ప్రవేశపెట్టారు. అంటే ఇకపై ఒక ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.10 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ నగదు డిపాజిట్/ విత్‌డ్రా చేసినప్పుడు మాత్రమే పాన్ కార్డు సమర్పించాల్సి ఉంటుంది. ఇది తరచూ చిన్నచిన్న నగదు లావాదేవీలు చేసేవారికి ఊరట కలిగిస్తుంది.

### వాహనాల కొనుగోలు- రూల్స్ ఛేంజ్

ఇప్పటి వరకు ధరతో సంబంధం లేకుండా ఏదైనా నాలుగు చక్రాల వాహనం కొనుగోలు చేయాలంటే పాన్ కార్డు తప్పనిసరిగా సమర్పించాలి. కానీ కొత్త ముసాయిదా నిబంధనల ప్రకారం, రూ.5 లక్షల కంటే తక్కువ ధర ఉన్న వాహనాలకు పాన్ కార్డు సమర్పించాల్సిన పనిలేదు. అయితే తొలిసారి రూ.5 లక్షల కంటే ఎక్కువ ధర ఉన్న టూవీలర్ (బైక్/స్కూటర్) కొనుగోలుకు పాన్ కార్డు తప్పనిసరి చేయాలని ప్రతిపాదించారు.

### హోటల్ బిల్లులకు కూడా

పర్యాటక, ఆతిథ్య రంగాలను ప్రోత్సహించేందుకు హోటల్, రెస్టారెంట్ బిల్లు చెల్లింపు పరిమితిని రెట్టింపు చేశారు. గతంలో రూ.50వేలకు పైన బిల్లు చెల్లించాలంటే పాన్ ఇవ్వాల్సి ఉండేది. కానీ ఇప్పుడు ఆ పరిమితిని రూ.1 లక్షలకు పెంచారు. ఈ నిబంధన బాంక్వెట్ హాళ్లు, కన్వెన్షన్ సెంటర్లు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సేవలకు కూడా వర్తిస్తుంది.

### రియల్ ఎస్టేట్ రంగానికి ఊతం

రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో పారదర్శకతను పెంచుతూనే, రాతపనిని తగ్గించేందుకు ఈ ముసాయిదాలో పలు నిబంధనలు మార్చారు. ఆస్తుల కొనుగోలు, విక్రయం లేదా కానుక (గిఫ్ట్) కింద జరిగే లావాదేవీలకు ఉన్న పాన్ పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచారు. అంటే రూ.20 లక్షల కంటే ఎక్కువ విలువైన ఆస్తి లావాదేవీలకు మాత్రమే పాన్ కార్డు సమర్పించాల్సి ఉంటుంది.

### ఇన్సూరెన్స్ సేవలకు

ఇక బీమా కంపెనీల నుంచి ఏదైనా పాలసీ కొనుగోలు చేయాలంటే, పాన్ కార్డు తప్పనిసరి చేయాలనే కొత్త నిబంధనలు ప్రతిపాదిస్తున్నాయి. మొత్తంగా చూసుకుంటే, డిజిటల్ ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడానికి, పన్ను చెల్లింపుదారులకు వ్యాపార సౌలభ్యాన్ని మెరుగుపరచడానికి ఈ మార్పులు బాగా ఉపకరిస్తాయని చెప్పవచ్చు. ఆదాయ పన్ను శాఖ 2026 ఫిబ్రవరి 22 నుంచి ఈ ముసాయిదా నిబంధనలపై అభిప్రాయాలను, అభ్యంతరాలను తెలియజేయాలని ప్రజలను కోరింది. ఒక వేళ ఈ ముసాయిదాకు ఆమోదం లభిస్తే, ఈ 2026 ఏప్రిల్ 1 నుంచే అమల్లోకి వచ్చే అవకాశం ఉంది.

### ఏప్రిల్ 1 నుంచి కొత్త చట్టం అమల్లోకి

న్యూ ఇన్‌కంట్యాక్స్ యాక్ట్ -2025 ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తుందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. సామాన్యులు కూడా ఈజీగా అర్థం చేసుకునేలా ఫారమ్‌లను సరళతరం చేసామని తెలిపారు. ఎన్‌ఆర్ఎస్ కింద టీసీఎస్ రేటు 5 శాతం నుంచి 2 శాతానికి తగ్గించాలని నిర్ణయించామన్నారు. సవరించిన పన్ను రిటర్నుల దాఖలు గడువును డిసెంబర్ 31 నుంచి మార్చి 31 వరకు పొడిగిస్తున్నట్లు తెలిపారు. అయితే ఈ బడ్జెట్లో మధ్యతరగతి ప్రజలు ఎదురుచూసిన ఆదాయపు పన్ను మినహాయింపులు ఏమీ లేవు. ఈసారి పన్ను శ్లాబుల్లో ఎటువంటి మార్పులు చేయనప్పటికీ, దశాబ్దాల కాలం నాటి పాత చట్టానికి స్వస్తి పలుకుతూ కొత్త అధ్యాయానికి తెరలేపారు. 60 ఏళ్ల నాటి 1961 ఆదాయపు పన్ను చట్టం స్థానంలో, ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆదాయపు పన్ను చట్టం-2025 అమల్లోకి తెస్తామని చెప్పారు. సంక్లిష్టంగా ఉన్న సెక్షన్లను 819 నుంచి 536కి తగ్గించి, సామాన్యులకు సైతం సులభంగా అర్థమయ్యేలా దీనిని రూపొందించామని చెప్పారు. గతేడాది ప్రకటించిన విధంగానే పన్ను శ్లాబులను ఉంచారు. అయితే సెక్షన్ 87ఏ కింద లభించే పన్ను రిబేట్ వల్ల రూ.12 లక్షల వరకు ఆదాయం ఉన్నవారికి ఎటువంటి పన్ను పడదు. దీనికి అదనంగా రూ.75,000 స్టాండర్డ్ డిడక్షన్ కలిపితే, రూ.12.75 లక్షల వరకు ఆదాయం ఉన్న శాలరీడ్ ఎంప్లాయిస్‌కు జీరో పన్ను వర్తిస్తుంది.

# మూడు రోజుల లాభాలకు బ్రేక్

**ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు**

**స్వల్ప నష్టాలతో సెన్సెక్స్, లాభాలతో నిఫ్టీ**

**భారీగా నష్టపోయిన ఐటీ రంగ షేర్లు, లాభపడ్డ ఆటో, ఫార్మా**

**డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలహీనపడిన రూపాయి**



దేశీయ స్టాక్ మార్కెట్లలో మూడు రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. బుధవారం ట్రేడింగ్‌లో సూచీలు రోజంతా లాభనష్టాల మధ్య ఊగిసలాడి చివరికి ఫ్లాట్‌గా ముగిశాయి. కీలకమైన ద్రవ్యోల్బణ (సీపీఐ) గణాంకాలు వెలువడనున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో మార్కెట్లో మిశ్రమ ధోరణి కనిపించింది.ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 40 పాయింట్ల స్వల్ప నష్టంతో 84,233 వద్ద స్థిరపడింది. అయితే, నిఫ్టీ 18 పాయింట్లు లాభపడి 25,953 వద్ద ముగిసింది. బ్రాడర్ మార్కెట్లు కూడా దాదాపు ఫ్లాట్‌గానే కదలాడాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.03 శాతం లాభపడగా, స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.02 శాతం పెరిగింది. బీఎస్ఈలో 1,701 షేర్లు లాభపడగా, 2,259 షేర్లు నష్టాల్లో ముగిశాయి. దీంతో మార్కెట్ బ్రెడ్త్ నెగిటివ్‌గా నమోదైంది.రంగాల వారీగా చూస్తే, ఐటీ, ప్రైవేట్ బ్యాంక్ సూచీలు మినహా మిగిలినవన్నీ లాభాల్లో ముగిశాయి. నిఫ్టీ ఐటీ సూచీ 1.76 శాతం మేర నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. మరోవైపు, నిఫ్టీ ఆటో 1.30 శాతం, ఫార్మా 1.01 శాతం, పీఎస్‌యూ బ్యాంక్ 1.03 శాతం చొప్పున లాభపడ్డాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 0.13 పైసలు బలహీనపడి 90.68 వద్ద ట్రేడయ్యింది. అంతర్జాతీయంగా మిశ్రమ సంకేతాలు, పెరుగుతున్న ముడిచమురు ధరలు రూపాయిపై ఒత్తిడి పెంచుతున్నాయి.మార్కెట్ స్పష్టమైన దిశానిర్దేశం చేసేంత వరకు పరిమిత శ్రేణిలోనే కదలాడవచ్చని, స్టాక్ ఆధారిత కదలికలే ఎక్కువగా ఉంటాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. బ్యాంక్ నిఫ్టీ 60,750 వద్ద ముగిసి, 60,500 మద్దతు స్థాయిని నిలబెట్టుకుంది.

# టెక్ చరిత్రలో అరుదైన ఘట్టం.. వందేళ్ల బాండ్ జారీ చేసిన గూగుల్

**ఏఐ విస్తరణ కోసం భారీగా నిధులు సమీకరించిన ఆల్ఫాబెట్**

**24 గంటల్లోనే వివిధ మార్కెట్ల నుంచి 32 బిలియన్ డాలర్ల సేకరణ**

**వందేళ్ల కాలపరిమితితో ప్రత్యేక 'సెంచరీ బాండ్' జారీ**

**ఏఐ, డేటా సెంటర్ల కోసం $185 బిలియన్ల పెట్టుబడులే లక్ష్యం**

**ఆల్ఫాబెట్ బాండ్లకు ఇన్వెస్టర్ల నుంచి అనూహ్యమైన స్పందన**




గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్ ఇంక్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకునేందుకు భారీ ప్రణాళికతో ముందుకొచ్చింది. ఈ క్రమంలో, రికార్డు స్థాయిలో దాదాపు 32 బిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో సుమారు రూ. 2.6 లక్షల కోట్లు) నిధులను కేవలం 24 గంటల్లోనే బాండ్ల రూపంలో సమీకరించింది. ఇందులో భాగంగా 100 ఏళ్ల కాలపరిమితితో 'సెంచరీ బాండ్' జారీ చేయడం టెక్ ప్రపంచంలో సంచలనంగా మారింది.ఫిబ్రవరి 9, 10 తేదీల్లో ఆల్ఫాబెట్ ఈ భారీ రుణ సమీకరణను పూర్తి చేసింది. అమెరికా మార్కెట్లో 20 బిలియన్ డాలర్లు, బ్రిటన్ మార్కెట్లో 5.5 బిలియన్ పౌండ్లు (సుమారు 7.53 బిలియన్ డాలర్లు), స్విస్ మార్కెట్లో 3.055 బిలియన్ ఫ్రాంకుల రూపంలో బాండ్లను విక్రయించింది. ముఖ్యంగా, బ్రిటన్‌లో జారీ చేసిన బాండ్లలో ఒక బిలియన్ పౌండ్ల విలువైన 100 ఏళ్ల 'సెంచరీ బాండ్' కూడా ఉంది. 1990ల తర్వాత ఒక పెద్ద టెక్ కంపెనీ ఇలాంటి సుదీర్ఘకాలిక బాండ్‌ను జారీ చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం.ఏఐ రంగంలో పెరుగుతున్న పోటీని తట్టుకుని, తన జెమినీ మోడల్, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను మరింత విస్తరించడమే లక్ష్యంగా ఆల్ఫాబెట్ ఈ నిధులను సమీకరించింది. 2026 సంవత్సరంలో సుమారు 185 బిలియన్ డాలర్ల మూలధన వ్యయం (క్యాపెక్స్) చేయాలని కంపెనీ అంచనా వేస్తోంది. ఇది గత ఏడాది కంటే దాదాపు రెట్టింపు కావడం గమనార్హం. ఈ నిధులను ప్రధానంగా ఏఐ సామర్థ్యాలను పెంచేందుకు, కొత్త డేటా సెంటర్ల నిర్మాణానికి ఉపయోగించనుంది.ఆల్ఫాబెట్ బాండ్లకు ఇన్వెస్టర్ల నుంచి అనూహ్యమైన స్పందన లభించింది. అమెరికా డాలర్ బాండ్ల కోసం ఏకంగా 100 బిలియన్ డాలర్లకు పైగా ఆర్డర్లు రాగా, 100 ఏళ్ల బాండ్‌కు కూడా దాదాపు 10 రెట్ల డిమాండ్ కనిపించింది. "సాధారణంగా ప్రభుత్వాలు లేదా స్థిరమైన ఆదాయం ఉండే యుటిలిటీ కంపెనీలు మాత్రమే వందేళ్ల బాండ్లను జారీ చేస్తాయి. ఇప్పుడు టెక్ కంపెనీకి కూడా ఇన్వెస్టర్లు అంతటి విశ్వాసాన్ని చూపడం ఏఐపై వారికున్న దీర్ఘకాలిక నమ్మకాన్ని సూచిస్తోంది," అని గ్లోబల్ మార్కెట్ విశ్లేషకురాలు లేల్ అకోనర్ వ్యాఖ్యానించారు.మరొక విశ్లేషకుడు గిల్ లూరియా మాట్లాడుతూ, "ఏఐ రేసులో తాము దీర్ఘకాలం ఉంటామని, గెలుస్తామన్న పూర్తి విశ్వాసంతో ఉన్నామని గూగుల్ ఈ చర్య ద్వారా చెప్పకనే చెబుతోంది," అన్నారు. అయితే, నిరంతరం వేగంగా మారుతున్న టెక్నాలజీ రంగంలోని కంపెనీపై ఇంత దీర్ఘకాలిక పెట్టుబడి పెట్టడం సమర్థనీయం కాదని కొందరు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మొత్తం మీద, ఈ భారీ రుణ సమీకరణతో ఆల్ఫాబెట్ తన భవిష్యత్తును పూర్తిగా ఏఐపైనే పందెం కాస్తోందన్న బలమైన సంకేతాన్ని మార్కెట్లకు పంపింది.

# ఎస్‌బీఐ యోనో యూజర్లకు అలర్ట్!

**తన ఖాతాదారులకు హెచ్చరిక జారీ చేసిన ఎస్‌బీఐ**

**కస్టమర్లకు ఆధార్ అప్‌డేట్ చేయకపోతే మీ ఎస్‌బీఐ యోనో ఖాతా బ్లాక్ అవుతుంది అంటూ నకిలీ మెసేజ్‌లు వస్తున్నట్లు వెల్లడి**

**ఈ తరహా సందేశాలు పూర్తిగా నకిలీవన్న ఎస్‌బీఐ**




దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తన ఖాతాదారులకు కీలక హెచ్చరిక జారీ చేసింది. కోట్లాది మంది వినియోగదారులు ఉపయోగిస్తున్న ఎస్‌బీఐ యోనో యాప్‌ను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని బ్యాంక్ తెలిపింది. వాట్సాప్ ద్వారా నకిలీ సందేశాలు పంపిస్తూ ఖాతాదారుల వివరాలు దొంగిలించి అకౌంట్లు ఖాళీ చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఎస్‌బీఐ అప్రమత్తం చేసింది. ఇటీవల ఎస్‌బీఐ కస్టమర్లకు ఆధార్ అప్‌డేట్ చేయకపోతే మీ ఎస్‌బీఐ యోనో ఖాతా బ్లాక్ అవుతుంది అంటూ నకిలీ మెసేజ్‌లు వస్తున్నట్లు బ్యాంక్ వెల్లడించింది. ఈ సందేశాల్లో ఎస్‌బీఐ లోగోతో పాటు Official Aadhaar Update APKని డౌన్‌లోడ్ చేసుకుని ఖీజ పూర్తి చేయాలని సూచిస్తూ SBI KYC AADHAAR UPDATE.apk అనే ఫైల్‌ను పంపిస్తున్నారు. ఈ తరహా సందేశాలు పూర్తిగా నకిలీవని ఎస్‌బీఐ స్పష్టం చేసింది. తమ బ్యాంక్ ఎప్పుడూ ాాాఖ ఫైళ్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని కస్టమర్లను కోరదని తెలిపింది. వినియోగదారులు ఆ ఫైల్‌ను డౌన్‌లోడ్ చేస్తే మొబైల్‌లో మాల్వేర్ ఇన్‌స్టాల్ అయ్యి బ్యాంక్ అకౌంట్ నుంచి డబ్బు మాయం అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించింది.అందువల్ల ఇలాంటి సందేశాలు వచ్చిన వెంటనే వాటిని పట్టించుకోకుండా డిలీట్ చేయాలని, సంబంధిత నంబర్‌ను బ్లాక్ చేయాలని ఎస్‌బీఐ సూచించింది. అలాగే ఘటనను వెంటనే బ్యాంక్ అధికారులకు తెలియజేయాలని తెలిపింది.ఇక ఎవరికైనా అనుకోకుండా ఆ ఫైల్ డౌన్‌లోడ్ చేసి డబ్బు నష్టం జరిగితే, వెంటనే సైబర్ మోసం హెల్ప్ లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని ఎస్‌బీఐ సూచించింది. అలాగే cybercrime.gov.inలోని నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో కూడా ఫిర్యాదు నమోదు చేయవచ్చని తెలిపింది.

# ఏఐకి సిద్ధం కండి, లేదంటే వెళ్లిపోండి

**ఉద్యోగులకు గూగుల్ వాలంటరీ ఎగ్జిట్ ఆఫర్!**

**ఏఐ వ్యూహంతో ఏకీభవించని ఉద్యోగులకు గూగుల్ వాలంటరీ ఎగ్జిట్ ఆఫర్**

**కంపెనీ వేగానికి అలవాటుపడని వారు వెళ్లిపోవచ్చని స్పష్టీకరణ**

**ప్రస్తుతానికి అమెరికాలోని గ్లోబల్ బిజినెస్ ఆర్గనైజేషన్ ఉద్యోగులకు వర్తింపు**

**రికార్డు స్థాయిలో 400 బిలియన్ డాలర్ల ఆదాయం ప్రకటించిన కొన్ని రోజులకే ఈ నిర్ణయం**

**కస్టమర్ సేవల విభాగాలకు ఈ ఆఫర్ నుంచి మినహాయింపు**




టెక్ దిగ్గజం గూగుల్ తమ ఉద్యోగులకు కీలకమైన, స్పష్టమైన సందేశం ఇచ్చింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత భవిష్యత్ ప్రణాళికలకు అనుగుణంగా పనిచేయడానికి సిద్ధంగా లేని వారు స్వచ్ఛందంగా కంపెనీ నుంచి వైదొలగవచ్చని తెలిపింది. ఈ మేరకు అమెరికాలోని తమ గ్లోబల్ బిజినెస్ ఆర్గనైజేషన్ (జీబీవో) విభాగంలోని కొంతమంది ఉద్యోగులకు వాలంటరీ ఎగ్జిట్ ప్యాకేజీని (స్వచ్ఛంద నిష్క్రమణ) ప్రకటించింది.గూగుల్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ ఫిలిప్ షిండ్లర్ ఈ మేరకు ఉద్యోగులకు ఒక అంతర్గత మెమో పంపారు. కంపెనీ ప్రస్తుతం ఏఐపై వేగంగా దృష్టి సారిస్తోందని, ఈ వేగాన్ని అందుకోలేని వారు లేదా గూగుల్ నుంచి వైదొలగాలని భావించేవారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చని పేర్కొన్నారు. ఏఐపై "ఆల్ ఇన్" (పూర్తిగా నిమగ్నమయ్యే) దృక్పథంతో ఉన్న ఉద్యోగులు మాత్రమే కంపెనీకి అవసరమని ఆయన స్పష్టం చేశారు. "ఆట వేగంగా మారుతోంది, పోటీ తీవ్రంగా ఉంది, పందెం చాలా పెద్దది" అని ఆయన తన మెమోలో వ్యాఖ్యానించారు.గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్ 2025 ఆర్థిక సంవత్సరంలో తొలిసారిగా 400 బిలియన్ డాలర్లకు పైగా రికార్డు స్థాయి ఆదాయాన్ని ప్రకటించిన కొన్ని రోజులకే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ముఖ్యంగా గూగుల్ క్లౌడ్, ఏఐ విభాగాల వృద్ధి ఈ లాభాలకు దోహదపడింది. అయితే, ఈ స్వచ్ఛంద నిష్క్రమణ పథకం కంపెనీలోని అందరికీ వర్తించదు. కస్టమర్లకు అంతరాయం కలగకుండా ఉండేందుకు అమెరికాలోని లార్జ్ కస్టమర్ సేల్స్ వంటి కొన్ని విభాగాలకు దీని నుంచి మినహాయింపు ఇచ్చారు. ఏఐ కేంద్రంగా తమ వ్యాపారాలను పునర్వ్యవస్థీకరించుకునే వ్యూహంలో భాగంగానే గూగుల్ ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది.

# భారత్-అమెరికా ట్రేడ్ డీల్ ఎఫెక్ట్

**తగ్గనున్న హార్లే డేవిడ్సన్ బైకుల ధరలు!**

**800 సీసీ నుంచి 1600 సీసీ ఇంజిన్ సామర్థ్యం కలిగిన బైక్‌లపై ఇకపై ఎలాంటి దిగుమతి సుంకాలు ఉండబోవని వెల్లడి**



అమెరికా నుంచి దిగుమతయ్యే మోటారు సైకిళ్లపై భారత్ భారీగా సుంకాలను తగ్గించింది. భారత్ - అమెరికా మధ్య ఎట్టకేలకు మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. 800 సీసీ నుంచి 1600 సీసీ ఇంజిన్ సామర్థ్యం కలిగిన బైక్‌లపై ఇకపై ఎలాంటి దిగుమతి సుంకాలు ఉండబోవని అధికార వర్గాలు వెల్లడించాయి. దీంతో అమెరికా ప్రీమియం బైక్ తయారీ సంస్థ హార్లే డేవిడ్‌సన్‌కు ఈ ఒప్పందం పెద్ద ఊరటగా మారనుంది.ఇదివరకే హార్లే డేవిడ్‌సన్‌కు ప్రభుత్వం సుంకాల విషయంలో కొంత వెసులుబాటు కల్పించింది. గతేడాది 1600 సీసీ వరకు ఇంజిన్ సామర్థ్యం కలిగిన వాహనాలపై 50 శాతంగా ఉన్న దిగుమతి సుంకాన్ని 40 శాతానికి తగ్గించింది. అలాగే 1600 సీసీ కంటే ఎక్కువ ఇంజిన్ సామర్థ్యం ఉన్న వాహనాలపై 50 శాతం సుంకాన్ని 30 శాతానికి కుదించింది. ఇక తాజాగా కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై భారత్ - అమెరికా ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. దీనిపై మార్చిలో అధికారికంగా సంతకాలు జరగనున్నాయి. ఒప్పందం అమలులోకి వచ్చిన తేదీ నుంచే కొత్త సుంకాల విధానం అమల్లోకి రానుంది.అమెరికా నుంచి దిగుమతయ్యే కార్లపై కూడా భారత్ సుంకాలను తగ్గించింది. 3000 సీసీ ఇంజిన్ సామర్థ్యం కలిగిన పెట్రోల్, డీజిల్ వాహనాలపై 10 సంవత్సరాల పాటు 30 శాతం చొప్పున సుంకం వర్తించనుంది. అయితే ఎలక్ట్రిక్ కార్లను ఈ ట్రేడ్ డీల్ నుంచి మినహాయించారు. దీంతో టెస్లాకు ఈసారి పెద్దగా ఊరట లభించలేదు. టెస్లా విక్రయిస్తున్న మోడల్ వై కార్లపై టారిఫ్‌లు యథాతథంగా కొనసాగనున్నాయి. ఇది దేశీయ ఆటోమొబైల్ కంపెనీలైన టాటా, మహీంద్రాలకు మాత్రం ఊరట కలిగించే అంశంగా భావిస్తున్నారు.

# భారత్ ఆర్థిక పరపతి భేష్- అమెరికా, ఈయూలతో ట్రేడ్ డీల్సే సంకేతం

**కేర్‌ఎడ్జ్ రేటింగ్స్**

**భారత్‌కు G/స్టేబుల్' సావరిన్ రేటింగ్-**

**సుస్థిరమైన ఆర్థిక భవిష్యత్తు కూడా!**



భారతదేశ ఆర్థిక పరపతి స్థితిగతులకు సూచికగా నిలిచే సావరిన్ క్రెడిట్ ప్రొఫైల్‌పై ప్రముఖ క్రెడిట్ రేటింగ్స్ ఏజెన్సీ 'కేర్ ఎడ్జ్ రేటింగ్స్' కీలక నివేదికను విడుదల చేసింది. ఇటీవలే యూరోపియన్ యూనియన్ (ఈయూ), అమెరికాలతో ఖరారైన వాణిజ్య ఒప్పందాలు భారతదేశ ఆర్థిక పరపతి బలంగా ఉందనే సంకేతాన్ని ఇచ్చాయని వెల్లడించింది. తాజాగా 2026 - 2027 కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన ఆర్థిక విధానాలు కూడా ఆ దిశగానే ఉన్నాయని తెలిపింది. ఈ పరిణామాలన్నీ భారతదేశానికి ప్రస్తుతమున్న 'బీబీబీ+/స్టేబుల్' సావరిన్ రేటింగ్‌ను సమర్థించేలా ఉన్నాయని విశ్లేషించింది. మోస్తరు రిస్క్‌తో సుస్థిరమైన ఆర్థిక భవిష్యత్తు, ఆర్థిక స్థితిగతులు కలిగిన దేశాలకే ఇలాంటి మెరుగైన రేటింగ్ లభిస్తుందని పేర్కొంది.



# సుహాస్ నాకు ఇండస్ట్రీలో మోస్ట్ సపోర్టీవ్ పర్సన్

టాలీవుడ్ యంగ్ హీరో సుహాస్ కథానయకుడిగా నటిస్తున్న తాజా సినిమా 'హే భగవాన్'. గోపి అచ్చర దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో శివాని నాగారం హీరోయిన్‌గా నటిస్తోంది. త్రిశూల్ విజనరీ స్టూడియోస్ బ్యానర్ పై బి.నరేంద్ర రెడ్డి నిర్మిస్తున్న ఆ సినిమాకు వివేక సాగర్ సంగీతాన్ని సమకూర్చారు. ఇక వెన్నెల కిశోర్, సుదర్శన్, అన్నపూర్ణమ్మ, యాంకర్ స్రవంతి వంటి ప్రముఖులు కీలక పాత్ర పోషిస్తున్న ఈ సినిమా షూటింగ్ కంప్లీట్ చేసుకుని ప్రజెంట్ పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుపుకుంటుంది. అయితే ఈ సినిమా ఫిబ్రవరి 20న థియేటర్లలో గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. దీంతో ప్రమోషన్స్ స్టార్ట్ చేసిన మూవీ టీమ్ వరుస ఇంటర్వ్యూలలో పాల్గొంటూ సినిమాపై ఆసక్తి పెంచుతున్నారు. ఈ క్రమంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న హీరోయిన్ శివాని అక్కడ హీరో సుహాస్ పై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. ఆమె మాట్లాడుతూ.. 'నాకు సుహాత్‌తో ఇది రెండో సినిమా. వెరీ స్పెషల్ ఈ మూవీ నాకు.. ఎందుకంటే అంబాజీపేటలో సుహాస్ నాకు అన్ని విషయాల్లో చాలా సపోర్టీవ్‌గా ఉన్నాడు. నాకు ఇండస్ట్రీలో చాలా సపోర్టీవ్ పర్సన్ అంటే సుహాసే. అతను నాకు చాలా హెల్ప్ చేశాడు. ఇప్పుడు ఈ సినిమా నాకు చాలా చాలా స్పెషల్‌గా.. అండ్ అతనితో మరో సారి స్క్రీన్ షేర్ చేసుకోవడం వెరీ వెరీ హ్యాపీగా ఉంది' అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆమె చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్‌గా మారాయి.

# నిన్న, మొన్న జరిగినట్లే ఉంది.. ఎంత అందమైన అనుభూతి!

ఎంతటి దూర ప్రయాణమైనా ఒక్క అడుగుతోనే మొదలవుతుంది. ఒక్క అడుగు పడిందంటే ఎంతో కొంత విజయం లభించినట్లే! అలా తన సినీ ప్రస్థానానికి పునాది వేసిన తొలి సినిమాను గుర్తు చేసుకున్నారు మెగాస్టార్ చిరంజీవి. 1979లో వచ్చిన పునాదిరాళ్లు సినిమాతో చిరంజీవి నటప్రస్థానం మొదలైంది. తొలి మెట్టుకే విజయాన్ని అందుకుని గుండె నిండా ధైర్యంతో ముందడుగు వేశారు. తనను తాను చెక్కుకుంటూ అంచెలంచెలుగా ఎదిగి పేరు ప్రఖ్యాతలు సంపాదించారు.

**చందమామ కథలాంటి అనుభూతి**

తాజాగా ఆయన పునాదిరాళ్లు సెట్‌లో అడుగుపెట్టిన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. "ఈరోజు "పునాదిరాళ్లు" సినిమా కోసం జీవితంలో కెమెరా ముందు నిలిచిన తొలి రోజు. ఆ రోజు నాలో కలిగిన ఆతృత, ఆనందం, బాధ్యత, భావోద్వేగం మాటల్లో వర్ణించలేను. ఆ క్షణం ఇప్పటికీ నిన్న, మొన్న జరిగిందేమో అన్నట్టు అనిపిస్తుంది. ఒక అందమైన చందమామ కథ లాంటి అనుభూతి.


**నట జీవితానికి పునాది రాళ్లు**

ఈ ప్రత్యేక సందర్భంలో, నాకు ఆ తొలి అవకాశం ఇచ్చిన ఆ చిత్ర దర్శక, నిర్మాతలకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. వారి నమ్మకం, ప్రోత్సాహంతో వచ్చిన అవకాశంతో నటనలో నా ప్రయాణానికి పునాది రాళ్లు పడ్డాయి. ఆ రోజు నుంచి ఈ రోజు వరకూ నన్ను ఆదరిస్తూ, ఆశీర్వదిస్తున్న ప్రేక్షకులందరికీ నా కృతజ్ఞతలు" అని ట్వీట్ చేశారు. తన ఫస్ట్ మూవీ చిత్రీకరణ సమయంలో దిగిన ఫోటోలను ఈ పోస్ట్‌కు జత చేశారు.



# వెంకీ మామ కోసం స్క్రిప్ట్ వర్క్‌లో అనుదీప్.. గ్రీన్ సిగ్నల్ ఇచ్చేనా?

టాలీవుడ్‌లో కామెడీకి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే విక్టరీ వెంకటేష్, తనదైన మార్క్ 'సెటైరికల్' హాస్యంతో ప్రేక్షకులను అలరించే దర్శకుడు కేవీ అనుదీప్ చేతులు కలపబోతున్నట్లు తెలుస్తోంది. 'జాతిరత్నాలు' సినిమాతో సెన్సేషన్ క్రియేట్ చేసిన అనుదీప్, ప్రస్తుతం మాస్ కా దాస్ విశ్వక్ సేన్‌తో తెరకెక్కించిన 'ఫంకీ' సినిమాను విడుదలకు సిద్ధం చేస్తున్నాడు. ఈ సినిమా ప్రమోషన్స్ సందర్భంగా అనుదీప్ తన తదుపరి చిత్రాలపై స్పందిస్తూ, వెంకటేష్ గారి కోసం ఒక ప్రత్యేకమైన కథను సిద్ధం చేస్తున్నట్లు స్వయంగా వెల్లడించారు. గతంలో అనుదీప్ వెంకటేష్‌కు ఒక కథను వినిపించగా, ఆయన సానుకూలంగా స్పందించారని సమాచారం. అయితే, స్క్రిప్ట్‌లో మరిన్ని మెరుగులు దిద్దాలని వెంకీ సూచించడంతో, ప్రస్తుతం అనుదీప్ ఆ పనుల్లో నిమగ్నమై ఉన్నట్లు తెలుస్తోంది. ఫైనల్ వెర్షన్ సిద్ధమయ్యాక మరోసారి నేరేషన్ ఇచ్చి గ్రీన్ సిగ్నల్ తీసుకోవాలని దర్శకుడు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్టైన్మెంట్స్ నిర్మించే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది. వెంకీమామ ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో 'ఆదర్శ కుటుంబం' అనే ఫ్యామిలీ క్రైమ్ కామెడీ సినిమాలో నటిస్తున్నారు. దీనితో పాటు అనిల్ రావిపూడి డైరెక్షన్‌లో ఒక ఎంటర్‌టైనర్, అలాగే 'దృశ్యం 3' కూడా లైన్‌లో ఉన్నాయి. ఈ ప్రాజెక్టులన్నీ పూర్తయిన తర్వాతే అనుదీప్ సినిమా పట్టాలెక్కే అవకాశం ఉంది.



# కొత్త సినిమా రూమర్స్‌పై స్పందించిన అనిల్ రావిపూడి



టాలీవుడ్ దర్శకుడు అనిల్ రావిపూడి తన తదుపరి సినిమాపై వస్తున్న పుకార్లకు తనదైన శైలిలో స్పందించారు. 'మన శంకర వరప్రసాద్' సినిమా 300 కోట్ల క్లబ్‌లో చేరిన తర్వాత, నాగార్జున లేదా వెంకటేష్‌తో సినిమా చేయనున్నారనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే ట్విట్టర్ వేదికగా స్పందించిన అనిల్, తాను ఇంకా స్క్రిప్ట్ కూడా మొదలుపెట్టలేదని, నటీనటులు, కథ, టైటిల్ అప్పుడే ఖరారు చేశారంటూ వస్తున్న వార్తలపై సెటైర్ వేశారు. త్వరలోనే అధికారిక ప్రకటన చేస్తానని హామీ ఇచ్చారు. బాక్సాఫీస్ వద్ద భారీ అంచనాలున్న ఈ ప్రాజెక్ట్ పై ఫిబ్రవరి చివరి నాటికి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.ఈ ఊహాగానాలపై ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించిన అనిల్ రావిపూడి,వ్యంగ్యంగా ఓ ట్వీట్ చేశారు."నేను ఇంకా కాగితం మీద కలం కూడా పెట్టలేదు. అప్పుడే కథ,నటీనటులు,టైటిల్ వరకు ఫిక్స్ చేసేశారు. ఇదే స్పీడ్ కొనసాగితే మీరే యాక్షన్...కట్ కూడా చెప్పేస్తారేమో!"అంటూ సెటైర్ వేశారు.తన పేరుతో వస్తున్న ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని ఆయన స్పష్టంచేశారు. తన తదుపరి సినిమా ఎవరితో, ఏ కథతో ఉండబోతుందన్న విషయాలను త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తానని తెలిపారు."నేను చేయబోయే సినిమా ఏది,ఎవరితో అనేది పూర్తి నిజమైన వివరాలతో అతి త్వరలో మీ ముందుకు తీసుకొస్తాం" అని అభిమానులకు భరోసా ఇచ్చారు.ప్రస్తుతం ఆయన చేసిన ఈ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# మీరు లేకుండా మేము ఏమీ చేయలేము



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పనిలేదు. 'ఏమాయ చేశావే' మూవీతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఈ చిన్నది.. ఇండస్ట్రీకి వచ్చిన అనతికాలంలోనే స్టార్ హీరోయిన్ రేంజ్‌కి వెళ్లిపోయింది. ఇక అక్కినేని హీరో నాగచైతన్యతో ప్రేమలో పడి అతన్నే మ్యారేజ్ చేసుకున్న ఈ బ్యూటీ ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో విడాకులు తీసుకొని విడిపోయారు. ఆ తర్వాత రీసెంట్‌గా బాలీవుడ్ దర్శకుడు రాజ్ నిడిమోరుతో పెళ్లిపీటలెక్కింది. కోయంబత్తూరులోని ఈషా ఫౌండేషన్‌లో యోగా ఆశ్రమంలో ఉన్న లింగ భైరవి ఆలయంలో వీరి పెళ్లి జరిగింది. ఇక మ్యారేజ్ తర్వాత మళ్లీ తమ ప్రొఫెషనల్ వర్క్‌లో బిజీ అయిపోయింది సమంత. 'శుభం' సినిమాతో నిర్మాతగా సక్సెస్ అందుకున్న సామ్ ఇప్పుడు 'మా ఇంటి బంగారం' సినిమాలో నటిస్తోంది. ఈ సినిమాకు కూడా సామ్‌నే నిర్మాతగా వ్యవహరిస్తోంది. దీనికి లేడీ డైరెక్టర్ నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. అయితే ఇందులో బాలీవుడ్ ప్రముఖ నటుడు కాంతార విలన్ గుల్షన్ దేవయ్య, దివ్యేందు కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇదిలా ఉంటే.. నిత్యం సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉంటూ అభిమానులకు దగ్గరవుతూ ఉంటుంది సామ్. ఈ క్రమంలో ఈ భామకు సంబంధించిన ఇన్‌స్టా స్టోరీ నెట్టింట వైరల్‌గా మారింది. తాజాగా సమంత తన ఇన్‌స్టాలో ఓ ఎమోషనల్ స్టోరీ పెట్టింది. పిక్ బాల్ స్పోర్ట్స్ టీమ్‌తో తీసుకున్న ఫొటోను షేర్ చేస్తూ.. మీరు లేకుండా ఇది నేను చేయలేను' అని రాసుకొస్తూ చెన్నై సూపర్ చాంపియన్స్‌తో పాటు కర్నాటేరియా అనే వ్యక్తిని ట్యాగ్ చేసింది.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.in epaper.vaarthasandhya.in. Cell : 73961 22101 , 99517 51662.